ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
మంగళవారం 26 నవంబరు 2024 | 5





సైబర్ భూతాలు

- ఉమ్మడి జిల్లాను వణికిస్తోన్న సైబర్ నేరాలు
- డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో పెరిగిన బెదిరింపులు
- ఒక్క ఫోన్ 'కాల్'తో కొల్లగొట్టేస్తున్నారు
- పెద్దాపురం, కరప, పి.గన్నవరంలో ఘటనలు
- ఫోన్ల ద్వారా వల వేసి లక్షల్లో గుంజుడు
- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

6

ఆలయాలు కిటకిట

- కార్తీకంలో నాలుగో సోమవారం.. దశమి కలిసి రావడంతో పోటెత్తిన భక్తులు



పిఠాపురం పాదగయ పుష్కరణిలో తెల్లవారుజామున స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కార్తీక మాసం నాలుగో సోమవారం, దశమి కలిసి రావడంతో జిల్లాలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో తెల్లవారుజామున భక్తులు పుణ్యస్నానాలు చేశారు. సామర్లకోట భీమేశ్వరాలయం, అన్నవరం పుణ్యక్షేత్రాలు భక్తులతో కళకళలాడాయి.

8



పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



సామర్లకోటలో భీమేశ్వరుడికి అభిషేకం



సామర్లకోట వద్ద ఆర్వోబీ పనులు

హైవేపై.. హాయిగా..

- వాకలపూడి-అన్నవరం హైవే నిర్మాణ పనులకు ఎట్టకేలకు మార్గం సుగమం
- 40.62కి.మీ.మేర కొత్త హైవే నిర్మాణానికి 90శాతం పూర్తయిన భూసేకణ
- వచ్చేనెల 4లోపు రూ.వెయ్యి కోట్లతో పనులకు టెండర్లు ఖరారయ్యే అవకాశం
- ఆరు మండలాల్లో 500 ఎకరాల భూసేకరణకు రూ.250కోట్ల వరకు వ్యయం
- 2026నాటికి హైవేను పూర్తిచేసి ఎన్‌హెచ్-16కు అనుసంధానం
- ఇది పూర్తయితే కాకినాడ పోర్టులు, సెజ్‌కు పెరగనున్న కనెక్టివిటీ
- వచ్చే ఏడాది సెప్టెంబర్‌నాటికి సామర్లకోట-కాకినాడపోర్టు పనులు పూర్తి
- రూ.540కోట్లతో మొదటిప్యాకేజీ 40%, రెండోప్యాకేజీ 70% పనులు పూర్తి

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

సుదీర్ఘ సాగరతీరం కలిగి ఉన్న కాకినాడ పారిశ్రామికపరంగా ఎదిగేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. కానీ ఎక్కడో మూలన ఉండడం, ప్రధాన జాతీయ రహదారికి దూరం కావడంతో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదు. కాకినాడలో రాష్ట్రప్రభుత్వానికి చెందిన యాంకరేజ్ పోర్టు, ప్రైవేటు కంపెనీల అధీనంలోని డీప్‌వాటర్ పోర్టు ఉన్నాయి. పైగా ఎన్నో ఏళ్ల కిందట పదివేల ఎకరాల్లో కాకినాడ సెజ్ సైతం ఏర్పాటైంది. దేశంలోనే ఇది అత్యంత పెద్ద సెజ్. మరో రెండేళ్లలో సెజ్‌లో కొత్తగా మరో ఓడరేవు కూడా రాబోతోంది. అటు విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ నడవాలో కూడా కాకినాడ కూడా ఉంది. అభివృద్ధికి ఎంతో కీలక అవకాశం ఉన్న కాకినాడకు రోడ్డు కనెక్టవిటీ అనుకున్నంతగా లేదు. దీంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాకినాడలో రెండు పోర్టులకు, సెజ్‌కు విశాఖ పోర్టు, అటు అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి పారిశ్రామిక, ఫార్మా ప్రాంతాల నుంచి భారీగా కార్గో వచ్చే అవకాశం ఉంది. కానీ ఈ కార్గో అన్నవరం హైవే మీదుగా కత్తిపూడి నుంచి పిఠాపురం మీదుగా కాకినాడ రావాలి. దీనికి ఎంతో వ్యయభారం.పైగా పలు పట్టణాలు కూడా మధ్యలో ఉండడంతో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు కాకినాడపోర్టు, సెజ్‌కు అనుసంధానం తక్కువగా ఉంటోంది. పైగా పారిశ్రామికపరంగాను సెజ్, పోర్టులు ఎదగాలంటే ప్రత్యేక హైవే అవసరమని కేంద్రం గుర్తించింది.

కాకినాడ సెజ్‌తోపాటు యాంకరేజ్, డీప్ వాటర్ పోర్టుల చుట్టూ జాతీయ రహదారి విస్తరణ ప్రణాళికలు శరవేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. భవిష్యత్తులో వీటినుంచి ఎగుమతుల వ్యాపారం, ప్రాంతీయ అభివృద్ధి భారీగా జరిగేలా కేంద్రం ప్రత్యేక శ్రద్ధతో ముందుకు కదులుతోంది. వాస్తవానికి కాకినాడ నగరం, దీన్ని ఆనుకుని ఉన్న పోర్టులు హైవేకు దూరంగా ఉండడంతో ఇతర ప్రధాన నగరాలతో అనుసంధానం తక్కువగా ఉంది. దీంతో పారిశ్రామిక పరంగాను ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో చెన్నై-కోల్‌కతా 16వనెంబరు జాతీయ రహదారిని అనుసంధానిస్తూ కొత్త హైవే విస్తరణ ప్రణాళికలకు హైవే అథారిటీ వేగంగా కసరత్తు చేస్తోంది.

అందులోభాగంగా కాకినాడ వాకలపూడి నుంచి అన్నవరం వరకు రూ.వెయ్యి కోట్లతో కొత్తగా హైవేను నిర్మించడానికి రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే 90శాతం భూసేకరణ పూర్తికావడంతో వచ్చే నెల 4నాటికి టెండర్లను ఖరారు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. అటు ఏడీబీ రోడ్డుపై సామర్లకోట నుంచి అచ్చంపేట, అచ్చంపేట నుంచి కాకినాడపోర్టుకు రెండు ప్యాకేజీల కింద రూ.540కోట్లతో మొదలుపెట్టిన పనులు ఇటీవల వేగం పుంజుకున్నాయి. వచ్చే ఏడాది సెప్టెంబరునాటికి ఈ పనులు పూర్తి కానున్నాయి.

ఈ నేపథ్యంలో కాకినాడ పోర్టులకు సమీపంలో ఉన్న వాకలపూడి నుంచి అన్నవరం బైపాస్ వరకు 40.62 కిలోమీటర్ల మేర హైవే నిర్మించాలని కేంద్రం కొన్నేళ్ల కిందట ప్రతిపాదించింది. ఇందుకు రూ.వెయ్యి కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. ఈ హైవే నిర్మాణ పనులు కాకినాడ రూరల్, యు.కొత్తపల్లి, తొండంగి, శంఖవరంతో కలిపి మొత్తం ఆరు మండలాల్లో 21 గ్రామాల్లో 562ఎకరాలు అవసరమని గుర్తించారు. ఇందులో 500ఎకరాలు పూర్తిగా ప్రైవేటు భూములే. వీటి సేకరణకు అనేక చిక్కులు రావడంతో రెండేళ్లపైనే సేకరణకు పట్టింది. ప్రధానంగా వాకలపూడి నుంచి యు.కొత్తపల్లి, తొండంగి మీదుగా అన్నవరం బైపాస్ వరకు అతికష్టంపై రెవెన్యూ అధికారులు భూసేకరణ ప్రక్రియను తాజాగా కొలిక్కి తీసుకువచ్చారు. 90శాతం భూమిని సేకరించి హైవే అథారిటీకి అప్పగించారు. దీంతో ఈ హైవే పనులకు సంబంధించి అతిపెద్ద చిక్కుముళ్లు వీడినట్లయింది. ఈ మేరకు ఎన్‌హెచ్ అధికారుల నుంచి రూ.230కోట్ల వరకు భూసేకరణకు నిధులు వెచ్చించారు. ఈ నేపథ్యంలో ఎన్నో ఏళ్ల ప్రతిపాదనలకు ఎట్టకేలకు మార్గం సుగమం అవడంతో ఈ రహదారి నిర్మాణానికి తాజాగా కేంద్ర రహదారులశాఖ టెండర్లు పిలిచింది. వచ్చే నెల 4న వీటిని ఖరారు చేయనుంది. వాస్తవానికి భూసేకరణ సమస్య వీడడంతో వచ్చే నెలకు టెండర్లు ఖరారు చేసి 2026నాటికి హైవేను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈహైవేను చెన్నై-కోల్‌కతా ఎన్‌హెచ్16కు అన్నవరం వద్ద అనుసంధానించనున్నారు. తద్వారా నేరుగా అనకాపల్లి జిల్లా నుంచి భారీ ఫార్మా కార్గో సైతం కాకినాడలోని ఓడరేవులకు, ఇక్కడి కార్గో ఇతర ప్రాంతాలకు సులువుగా ఎగుమతి, దిగుమతులు చేయడానికి వీలుపడుతుంది. అన్నవరం నుంచి కత్తిపూడి మీదుగా కాకినాడకు ద్విచక్రవాహనాలు, కార్లలో వచ్చే వారికి సమయం అధికంగా తీసుకుంటోంది. అన్నవరం నుంచి వాకలపూడికి భవిష్యత్తులో నిర్మాణం కానున్న హైవే ద్వారా చాలాతక్కువ దూరం,సమయంలో చేరుకోవచ్చు.

హమ్మయ్య.. ఆ బాధ తీరినట్లే..

కాకినాడ యాంకరేజ్, డీప్‌వాటర్ పోర్టుకు రాష్ట్రంలో అనేక జిల్లాలతోపాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, కేరళ తదితర రాష్ట్రాల నుంచి వందలాది లారీలు బియ్యం ఎగుమతుల కోసం వస్తుంటాయి. అటు భారీ గ్రానైట్ రాళ్ల సైతం వందలాది లారీలు ఏడీబీ రోడ్డుమీదుగా కాకినాడమీదుగా పోర్టుకు రాకపోకలు సాగిస్తుంటాయి. వందలాది లారీలు ఏడీబీ రోడ్డులో సామర్లకోటకు రాగానే పోర్టు వరకు రహదారి పూర్తిగా నరకప్రాయంగా ఉండడంతో నరకం చూస్తున్నాయి. వాహనాలు పాడైపోవడంతోపాటు సమయం భారీగా వృథాఅవుతోంది. రహదారి అత్యంత ఇరుగ్గా ఉండడంతో పోర్టుకు వెళ్లడానికి తలనొప్పిగా మారింది. కాకినాడలోని అచ్చంపేట జంక్షన్ మీదుగా ఇవన్నీ పోర్టుకు వెళ్లాలి. తీరా నగరంలో ట్రాఫిక్ తీవ్రత కారణంగా పలు సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో సామర్లకోటనుంచి కాకినాడ పోర్టు వరకు ప్రస్తుతం ఉన్న ఇరుకు రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించే పనిని హైవే అధికారులు గతేడాది ప్రారంభించగా అవన్నీ ఇప్పుడు చురుగ్గా సాగుతున్నాయి. మొత్తం రెండు ప్యాకేజీల కింద 26 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారి పనులు వేగంగా కదులుతున్నాయి. ప్యాకేజీ-1 కింద సామర్లకోట నుంచి అచ్చంపేట జంక్షన్ వరకు ఏడీబీ రోడ్డును సామర్లకోట పట్టణం నుంచి తప్పించి రాక్‌సిరామిక్ నుంచి ఎఫ్‌సీఐ గోదాము, షుగర్ ఫ్యాక్టరీ వెనుక నుంచి గోదావరి కాలువ మీదుగా సామర్లకోట ప్రస్తుత రోడ్డుకు కలుపనున్నారు. ఇందుకోసం రాక్‌సిరామిక్‌వద్ద ఆర్వోబీ పని 40శాతం పూర్తయింది. ప్యాకేజీ-1 కింద సామర్లకోట నుంచి అచ్చంపేట వరకు 12.25 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇవి వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి పూర్తికానున్నాయి. ప్యాకేజీ-2 కింద అచ్చంపేట జంక్షన్ నుంచి కాకినాడ యాంకరేజ్ పోర్టు వరకు 13.2 కిలోమీటర్లు నాలుగు లేన్ల రహదారి పనులు 70శాతం పూర్తయ్యాయి. ఆర్కే ఇన్‌ఫ్రా కంపెనీ ఈపనులు దక్కించుకోగా అచ్చంపేట జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు మొదలుపెట్టింది. ఇవి 2025 ఏప్రిల్‌కు పూర్తికానున్నాయి.

ఫీజురీయింబర్స్‌మెంట్‌పై ఇబ్బంది పెట్టొద్దు

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల కారణంగా ఏ విద్యార్థికి హాల్ టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాకుండా నిరోధించడం చేయరాదని, ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆయా కళాశాలల యాజమాన్యాలను హెచ్చరించారు. సోమవారం అన్ని కళాశాలలకు యూవో నోట్‌ను కూడా పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పలు విద్యాసంస్థల యజమాన్యాలు విద్యార్థులనుంచి ఫీజులు చెల్లించాలని ఒత్తిళ్లు తెస్తున్నట్లు, తరగతులకు హాజరు కానీయకుండా, హాల్‌టిక్కెట్లు ఇవ్వకుండా పరీక్షలకు హాజరయ్యేందుకు ఆటంకం కల్గిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందుకునే విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికే ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబ్స్‌మెంట్‌ను కళాశాలలకు నేరుగా విడుదల చేస్తామని, పాతబకాయిలు కూడా క్రమంగా చెల్లిస్తామని స్పష్టంగా ప్రకటించిందన్నారు.ప్రభుత్వఆదేశాలను ఉల్లంఘించి, విద్యార్థుల తల్లిదండ్రులనుంచి బలవంతపు ఫీజు వసూళ్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉప్పాడ తీరంలో ఎగసిపడుతున్న అలలు 7

అన్నవరం దేవస్థానం ఈవోగా త్రినాథరావు 7

కిర్లంపూడిలో 163 కిలోల గంజాయి స్వాధీనం 7

రబీ సాగుకు సర్వం సిద్ధం

- వచ్చేనెల 7వతేదీలోపు వెదజల్లే పద్ధతిలో సాగు
- 20 లోపు నాట్లు పూర్తి చేయాలి
- 2లక్షల10వేల ఎకరాల్లో వరి.. 20వేల ఎకరాల్లో అపరాల సాగు
- వచ్చే మార్చి 15కల్లా పంట చేతికి..
- సీజన్‌ను ముందుకు తీసుకొచ్చేందుకు ప్రయత్నం
- ధాన్యం దిగుబడి లక్ష్యం 5లక్షల మెట్రిక్ టన్నులు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సాగును కార్యాచరణ ప్రణాళికను వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసింది. కాకినాడ జిల్లాలో 20మండలాల్లో రబీ సాగు చేయాలని నిర్ణయించారు. 2లక్షల10వేల ఎకరాల్లో వరిసాగు చేయాలని కార్యాచరణలో పేర్కొన్నారు. 20వేల ఎకరాల్లో మినుము, పెసర వంటి అపరాలు సాగు చేయనున్నారు. వచ్చేనెల 7వ తేదీలోపు వరిసాగు వెదజల్లే పద్ధతిలో చేయాలని రైతులను కోరుతున్నారు. అదే నర్సరీ పెంచి నాట్లు వేసే రైతులు వచ్చేనెల 20 లోపు పూర్తి చేయాలని కోరుతున్నారు. జిల్లాలో సాగు సీజన్‌ను ముందుకు తీసుకురావడం ద్వారా తుఫాన్ల బారినుంచి పంటలను రక్షించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. నిర్దేశించిన సమయానికి రబీ సాగు చేస్తే వచ్చే మార్చి 15వతేదీకల్లా రబీ పంట రైతు చేతికి వస్తుంది. ఆ తర్వాత 75 రోజుల్లో సాగయ్యే అపరాలను మూడో పంటగా రైతు సాగుచేస్తారు. జూన్ మొదటి వారంలో ఖరీఫ్ ప్రారంభించే అవకాశం ఉంటుంది. దీనివల్ల సీజన్ ముందుకు వస్తుంది. అక్టోబరు, నవంబరు నెలల్లో ఉత్పన్నమయ్యే తుఫాన్ల వల్ల పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ బలమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. రబీ సీజన్‌లో వరిలో ప్రధానంగా ఎంటీయూ 1121, ప్రభాత బొండాలురకం 3626, టాటా బొండాలు రకం, ఆర్‌ఎన్‌ఆర్ 15028, సాధన, అంకురసోనా, ఆర్‌పీ బయోరకాల విత్తనాలు నాటనున్నారు. వరిని ప్రధానంగా జిల్లాలో కాజులూరు, గొల్లప్రోలు, కాకినాడ రూరల్, కరప, పెదపూడి, పిఠాపురం రూరల్, సామర్లకోట రూరల్, తాళ్లరేవు, యూ.కొత్తపల్లి, కిర్లంపూడి, పెద్దాపురం రూరల్ మండలాల్లో సాగు చేస్తున్నారు. 20వేల ఎకరాల్లో మినుము, పెసర వంటి అపరాలు సాగు చేయనున్నారు. 12,500 మెట్రిక్ టన్నులు దిగుబడి లక్ష్యంగా నిర్దేశించారు. అపరాలను జిల్లాలో ప్రధానంగా తొండంగి, తుని, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం, జగ్గంపేట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లో సాగు చేస్తున్నారు. రబీలో రైతులకు కావాల్సిన సాగునీరు వంతులవారీగా అందించేందుకు ఇరిగేషన్ అధికారులు ప్రణాళికలు రూపకల్పన చేశారు.

రబీసాగుకు విత్తనాలు సిద్ధం

రబీసాగుకు కావాల్సిన విత్తనాలు,ఎరువులు సిద్ధంగా ఉంచాం. వ్యవసాయ సీజన్‌ను ముందుకు తీసుకురావడం ద్వారా ప్రకృతి విపత్తులనుంచి పంటలను రక్షించుకోగలం. రైతులు వ్యవసాయశాఖ సూచనల మేరకు వరిసాగు చేయాలి. రబీ ధాన్యం దిగుబడి లక్ష్యం 5లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించాం.

వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్

వారంరోజుల్లో ఇసుక అందుబాటులోకి..

- కాకినాడ రూరల్, పెద్దాపురం, గొల్లప్రోలులో స్టాక్ యార్డుల పరిశీలన
- ఇసుక నిల్వ చేయడంతోపాటు రవాణా సౌకర్యాలపై రెవెన్యూ బృందాలు తనిఖీలు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వారం రోజుల్లో స్టాక్ యార్డుల్లో ఇసుక అందుబాటులోకి రానుంది. ఈ మేరకు స్టాక్ యార్డుల స్థలాలను అధికారుల బృందం తనిఖీ చేస్తోంది. ఇసుక స్టాక్ యార్డులను కాకినాడ రూరల్, పెద్దాపురం, గొల్లప్రోలులో ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు లాటరీ విధానంలో కాంట్రాక్టర్లను ఎంపిక చేశారు. పెద్దాపురం స్టాక్ యార్డుకు టీఆర్ వాసుదేవ ఇంజనీరింగ్, కాకినాడ రూరల్‌లో స్టాక్ యార్డుకు మిథుల కన్‌స్ట్రక్షన్‌కు, గొల్లప్రోలు యార్డును శ్రీదేవి కనస్ట్రక్షన్‌ను ఎంపిక చేసింది. ఇవి ఏర్పాటు అయ్యే స్థలాలను ఆర్డీవో ఆధ్వర్యంలో రెవెన్యూ బృందాలు పరిశీలిస్తున్నాయి. ఇసుక నిల్వ చేయడంతోపాటు రవాణా ఇతర సౌకర్యాలను పరిశీలిస్తున్నారు. ఇసుక స్టాక్‌యార్డు చుట్టూ సీసీ కెమేరాలు ఎలా ఏర్పాటు చేస్తున్నారు.. వంటి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ మూడు స్టాక్‌యార్డుల నుంచి ఇసుక విక్రయించడానికి వారం రోజులు పడుతుందని జేసీ రాహుల్‌మీనా ఆంధ్రజ్యోతికి వెల్లడించారు. కాకినాడ రూరల్, పెద్దాపురంల్లో టన్ను ఇసుక రూ.600 చొప్పున, గొల్లప్రోలు యార్డులో టన్ను ఇసుక రూ.582కు అందజేస్తారు. స్థలాల పరిశీలన, సీసీ కెమేరాల ఏర్పాటు, సెక్యూరిటీ గార్డుల ఏర్పాట్లు వంటి వాటిలో జాప్యం వల్ల మరో వారంరోజులు సమయం పట్టనుంది.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందిన అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజలనుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు ఇతర అధికారులతో కలిసి ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు.రెవెన్యూ, పింఛన్లు, బియ్యంకార్డు మంజూరు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇళ్లస్థలాలు తదితర అంశాలపై 431అర్జీలు అందాయన్నారు. కేఎస్ఈజెడ్ ఎస్డీసీ రామలక్ష్మి, సీపీవో త్రినాథ్, కేఆర్ఆర్సీ ఎస్డీసీ రత్నమణి పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 59 అర్జీలు

కాకినాడ క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే బాధితులకు వారి సమస్యలను పరిష్కరించాలని అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 59మంది అర్జీదారులు పోలీస్ గ్రీవెన్స్‌సెల్‌ను సోమవారం ఆశ్రయించారు. ఫిర్యాదుదారుల గోడు విన్న అడ్మిన్ ఎస్పీ స్పందించి సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమస్య సమ్మతమైనదైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు.



అర్జీదారుల గోడు వింటున్న అడ్మిన్ ఎస్పీ భాస్కరరావు

విద్యార్థులకు.. ఆపార్ కార్డు కష్టాలు

- పెండింగ్‌లో ఇంకా 73,728మంది...

పిఠాపురం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకూ విద్యార్థుల అకాడమిక్ సమాచారాన్ని నిక్షిప్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆటోమెటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(ఆపార్)ను తీసుకొచ్చింది. ఈ కార్డుల్లో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెల గుర్తింపుతో నెంబరు ఉంటుంది. విద్యార్థి హిస్టరీ మొత్తం ఇందులో నిర్లిప్తమై, ఆ విద్యార్థి దేశంలో ఎక్కడ చదవడానికి వెళ్లిన ఇబ్బంది లేకుండా చేయాలనేది కేంద్ర పభుత్వ ఉద్దేశ్యం. ఈపద్ధతి బాగానే ఉన్నప్పటికీ విద్యార్థులు నెలరోజులుగా కష్టాలు తప్పడం లేదు. వారి తల్లిదండ్రులు కూలి పనులు మానేసి ఆధార్ మార్పులకోసం ఆయాకేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొన్నిస్కూల్స్‌లో విద్యార్థులను ఉపాధ్యాయులను ఇళ్లకే పంపేస్తున్నారు. ఆధార్‌కార్డుల్లో తప్పులవల్ల పుట్టిన తేదీల మార్పునకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం మాత్రం మార్చి నెలాఖరుకు అందరూ తప్పులు సవరించుకుని నమోదు చేసుకోవాలని చెబుతోంది. 2017 సంవత్సరం తర్వాత పుట్టిన వారికి మాత్రమే ఆన్‌లైన్‌లో పుట్టిన తేదీ ధ్రువపత్రాలు జారీ అవుతున్నాయి. అంతకంటే ముందు పుట్టిన వారి డేటా ఆన్‌లైన్ చేయక ఆధార్‌లో మార్పులు, చేర్పులకు అవస్థలు పడుతున్నారు. కనీసం 30 నుంచి 60రోజులు పట్టే అవకాశం ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో అయితే మరింత ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందని తల్లిదండ్రుల గగ్గోలు పెడుతున్నారు.

విద్యార్థుల వివరాలిలా...

కాకినాడ జిల్లాలో ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకూ 3,30,626 మంది విద్యార్థులు ఉండగా ఇప్పటివరకూ అపార్ ఆన్‌లైన్ చేసుకున్నవారు 2,63,799మంది ఉన్నారు. ఇంకా 73,728మంది ఆన్‌లైన్ చేయించుకోవాల్సి ఉంది. డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్థులు, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు లక్ష పైబడి ఉన్నారు. వీరంతా ఆన్‌లైన్ చేయించుకోవాల్సి ఉంది. ఆధార్ సవరణ కేంద్రాలు మరిన్ని ఏర్పాటు చేస్తే మార్చి నాటికి అందరికీ ఆపార్ కార్డు పొందే అవకాశం దక్కుతుంది.

బాల్య వివాహ రహిత ఏపీ లక్ష్యం: కలెక్టర్ షాన్‌మోహన్



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వ ఈనెల 27న బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్రమం చేపడతామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమానికి సంబంధించి కలెక్టర్, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు, ఐసీడీఎస్ పీడీ ప్రవీణ తదితర అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈనెల 27 నుంచి డిసెంబరు 10 వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం కింద జిల్లా అంతటా ప్రతిఒక్కరూ బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసేలా చూడాలని ఆదేశించారు.

డిజిటల్ అరెస్ట్ చేసి కోటి కొట్టేశారు..

పెద్దాపురం గోలివారి వీధిలోని కొండలరావు అనే వ్యక్తిని ఈ ఏడాది ఆగస్టులో డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ కేటుగాళ్లు భయపెట్టారు. అతడి నుంచి బ్యాంక్ అకౌంట్, యూపీఐ ద్వారా దశలవారీగా రూ.1కోటి 16 లక్షల 24 వేల 382 దోచేశారు. ఈడీ, సీబీఐ, ఆర్‌బీఐ, పోలీస్ అధికారులమని చెప్పి అతడిని భయభ్రాంతులకు గురిచేశారు. డిజిటల్ అరెస్ట్ అంటే భయపడి అతడు వారు చెప్పిన అకౌంట్‌కు డబ్బులు జమచేశాడు. ఇంకా డబ్బులు కావాలని వేధించడంతో విషయం తెలిసిన అతడి కుమారుడు సైబర్ మోసానికి గురైనట్లు గ్రహించి పోలీస్‌స్టేషన్‌లో సెప్టెంబరు 25న ఫిర్యాదు చేశారు.

ట్రేడింగ్ కంపెనీ పేరున రూ.28.30 లక్షలు..

కొవ్వూరుకు చెందిన జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్ కండాల వెంకట ద్వారకా శ్రీనివాస్ షేర్‌మార్కెట్ వ్యాపారం చేస్తుంటాడు. రాజమహేంద్రవరానికి చెందిన మోతీలాల్ ఆశ్వాల్ ట్రేడింగ్ కంపెనీ ద్వారా లావాదేవీలు చేస్తుంటాడు. ఇదిలా ఉండగా ఇన్‌స్టాగ్రామ్‌లో అతనికి ఒక లింక్ వచ్చింది. అతను ట్రేడింగ్ చేసే కంపెనీ పేరున లింక్ ఉంది. ఈ మేరకు శ్రీనివాస్ ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన యాప్‌నకు దఫదఫాలుగా రూ.28.30 లక్షలు జమచేశాడు. చివరికి అది నకిలీదని తేలడంతో లబోదిబోమన్నారు. పట్టణ పోలీసులను ఆశ్రయించగా సైబర్‌క్రైమ్‌గా కేసునమోదు చేశారు.

మిషన్ తక్కువకు వస్తుందని..భర్తకు తెలియకుండా

కొవ్వూరు పట్టణానికి చెందిన గుల్లపూడి సుప్రియ వద్ద ఫేస్‌బుక్ అకౌంట్‌లో మహిళల జాకెట్లు కుట్టే ఎంబ్రాయిడరీ కుట్టుమిషన్ తక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు ఒక ప్రకటన చూసింది. కుట్టుమిషన్ తీసుకోవడం ద్వారా కుటుంబానికి ఆసరాగా ఉంటుందని భావించి భర్తకు తెలియకుండా ప్రకటనలో ఉన్న నెంబరుకు ఫోన్ చేసింది. అవతలి వ్యక్తి సూచించిన విధంగా రూ.3లక్షల సొమ్మును రెండు దఫాలుగా న్యూఢిల్లీకి చెందిన అకౌంట్ నెంబరుకు 2024, జూన్ 25న జమ చేసింది. సొమ్ము చెల్లించిన అనంతరం ఫోన్ స్పందించకపోవడంతో మోసపోయినట్లు గ్రహించింది.

వైద్యుడి నుంచి లాగేశారు..

రాజమహేంద్రవరానికి చెందిన ఒక వైద్యుడు.. నిత్యం బిజీగా ఉంటాడు.. ఆయనకు ఇటీవల ఒక ఫోన్ వచ్చింది..మీకు ఢిల్లీ నుంచి ఒక పార్శిల్ వచ్చింది.. ఆ పార్శిల్‌లో కొకైన్.. హెరాయిన్ ఉన్నాయి.. మేం ఇంటెలిజెన్స్ పోలీసులం అంటూ అవతలి నుంచి ఒక వ్యక్తి లైవ్‌లోకి వచ్చాడు.. వెనుక చూస్తే పోలీస్‌స్టేషన్ సెటప్ ఉంది.. 24 గంటలు మీరు ఎక్కడికి వెళ్లకూడదు.. ఎవరితోనూ మాట్లాడకూడదు.. ఫోన్‌లు చేయకూడదు.. అలా చేస్తే లోకల్ పోలీసులు వస్తారని భయపెట్టి సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు చేశారు.. అతని నుంచి పెద్ద మొత్తంలో లాగేశారు.



'హాలో నేను సీబీఐ అధికారిని మీకు విదేశాల నుంచి ఓ పార్సిల్ వచ్చింది. అందులో నిషేధిత డ్రగ్స్ ఉన్నాయి. మీపై కేసు నమోదైంది..' అంటూ ఓ వ్యక్తికి వీడియోకాల్ వచ్చింది. అటువైపు చూస్తే పోలీస్ ఉన్నతాధికారిలా ఉన్నారు. వెనుక సెటప్ అంతా పోలీస్‌స్టేషన్‌లా ఉంది. తీరా చూస్తే ఎఫ్ఐఆర్ నమోదైంది అంటున్నారు.. ఏం చేయాలో తెలియడంలేదు. ఒక్కసారిగా మైండ్ బ్లాంక్ అయింది. 'మీపై నమోదైన ఎఫ్ఐఆర్ కాపీ ఇదిగో..' అంటూ అటువైపునుంచి మీకు దాన్ని వాట్సాప్ చేస్తారు. అందులో మీకు సంబంధించిన అన్ని వివరాలు పొందుపరిచి ఉంటాయి. దీంతో ఇంకా టెన్షన్.. 'ఇది దేశభద్రతకు ముప్పువాటిల్లే కేసు అని, ఈ కేసులో అరెస్టు అవడం తప్పదని, బెయిల్ రావడం కూడా అతికష్టమని బెదిరిస్తాడు.. డిజిటల్ అరెస్టు చేస్తున్నాం.. అంటాడు..' దీంతో భయాందోళనకు గురైన బాధితుడు మెల్లగా అతడి ట్రాప్‌లోకి వెళ్లి అతడు ఏం చెప్తే అది చేస్తాడు. తన యూపీఐ ఐడీ, ఓటీపీ చెప్పే వరకూ వెళ్తుంది పరిస్థితి. ఇలా డిజిటల్ అరెస్ట్ పేరుతో మీ అకౌంట్‌లో డబ్బులు మొత్తం ఖాళీ చేస్తారు.. ఇదొక ఫేక్ కాల్ అని.. అదొక ఫేక్ ఎఫ్ఐఆర్ అని.. ఇది సైబర్ నేరమని మీకు తెలిసేలోపు మీరు మోసపోతారు. డిజిటల్ అరెస్టు పేరుతో ఇటీవల ఇలాంటి మోసాలు ఎక్కువయ్యాయి. మన ఉమ్మడ జిల్లాలో కరప, పి.గన్నవరం, రాజమహేంద్రవరంల్లో ఈ తరహా మోసాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో సైబర్ నేరాలపై అప్రమత్తం చేస్తూ ప్రత్యేక కథనం..

(కాకినాడ/అమలాపురం/రాజమహేంద్రవరంసిటీ/శంఖవరం/కొవ్వూరు, ఆంధ్రజ్యోతి)

- » ఉమ్మడి జిల్లాను వణికిస్తోన్న సైబర్ నేరాలు
- » డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో పెరిగిన బెదిరింపులు
- » ఒక్క ఫోన్ 'కాల్'తో కొల్లగొట్టేస్తున్నారు
- » పెద్దాపురం, కరప, పి.గన్నవరంలో ఘటనలు
- » నకిలీ వాట్సాప్ డీపీలతోనూ మోసాలు
- » ఫోన్ల ద్వారా వలవేసి లక్షల్లో గుంజుడు
- » రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను సైబర్ నేరాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇటీవల సైబర్ నేరాలు నిత్యకృత్యమైపోయాయి. పోలీసు యూనిఫాం వేసుకుని వెనుక పోలీస్‌స్టేషన్ సెటప్‌తో ఫోన్లు చేసి బెదిరిస్తూ అందిన కాడికి గుంజేస్తున్నారు. వాట్సాప్ వీడియోకాల్స్ చేస్తూ ఎదుటి వ్యక్తి ఆధార్‌కార్డు నెంబర్, ఇంటి చిరునామా, ఇతర వివరాలు పక్కాగా చెబుతూ నిజమేనని భ్రమపడేలా బెదిరించేస్తున్నారు. కొన్ని గంటల్లో ఇంటికి వచ్చి అరెస్ట్ చేస్తామంటూ బెంబేలెత్తించేస్తున్నారు. ఇలా ఒకరు కాదు.. ఇద్దరు కాదు..భారీసంఖ్యలో జిల్లాలో అనేకమందిని భయపెట్టి వేలు.. లక్షలు.. కోట్లు.. కొల్లగొట్టేస్తున్నారు. ఈ మోసగాళ్ల బారినపడి జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగుల దగ్గర నుంచి విద్యార్థులు, వ్యాపారులు, రైతులు, ఇతర అమాయకులు మోసపోతున్నారు. నేరగాళ్ల మాటలకు భయపడి అప్పటికప్పుడు ఫోన్‌పే, గూగుల్ పేల ద్వారా డబ్బులు ముట్టజెబుతున్నారు. తాజాగా ఉమ్మడి జిల్లాలో రాజమహేంద్రవరం, కరప, పి.గన్నవరం మండలాల్లో రెండు రోజుల వ్యవధిలో ఒకే వ్యక్తి సైబర్ నేరాలకు పాల్పడి డబ్బులు గుంజడం పెరిగిపోతున్న నేరాలను కళ్లకు కడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో కలెక్టర్ల ఫొటోలను వాట్సాప్ డీపీగా పెట్టి డబ్బులు అడుగుతున్న కేసులూ నమోదయ్యాయి.

రోజుకో మోసం..

ఒకప్పుడు నగరాలకే పరిమితమైన సైబర్ నేరగాళ్ల మోసాలు ఇప్పుడు పట్టణాలు, గ్రామాలకు సైతం విస్తరించాయి.జనాలను నిలువుదోపిడీ చేసేస్తున్నాయి. నగరాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను పోలీస్ అరెస్ట్‌ల పేరుతో బెదిరిస్తే కాసులు రాలతాయనే ఆలోచనతో సైబర్ నేరగాళ్లు బరితెగించేస్తున్నారు. గతంలో సైబర్ నేరాలు కేవలం ఫోన్లలో ఫొటోల మార్ఫిడి, మహిళలకు ఫోన్లలో వేధింపులు, గిఫ్ట్‌ల పేరుతో ఫోన్లు చేసి డబ్బులు అడగడం, ఫోన్లకు లింకులు పంపి ఓపెన్ చేయగానే బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు మాయం చేసే ఘటనలు ఉండేవి. కానీ గడచిన రెండేళ్లగా సైబర్ నేర గాళ్లు రూటుమార్చి కోట్లలో డబ్బులు కొల్లగొట్టేస్తున్నారు. నెలకు పది సైబర్ నేరాలు నమోదైతే అందులో 8 కేసులు వీడియోకాల్స్ చేస్తూ ఫలానా నేరం మీపై నమోదైంది.అరెస్ట్ చేయడానికి వస్తున్నాం అనే బెదిరింపు ఫోన్‌కాల్స్‌తో డబ్బులు గుంజిన కేసులే.

మచ్చుకు కొన్ని కేసులు

ఈ ఏడాది అక్టోబరులో పెద్దాపురంలో ఓ భూస్వామికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మీపై ఈడీ, సీబీఐ కేసులున్నాయి. అరెస్ట్‌కు అనుమతి వచ్చింది అని బెదిరింపులు వీడియోకాల్స్ వచ్చాయి. అరెస్ట్ చేయకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలంటూ నెలరోజుల వ్యవధిలో రూ.1.16కోట్లు గుంజేశారు.తాజాగా కాకినాడ జిల్లా కరప మండలంలో ఓ ప్రైవేటు ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు వీడియోకాల్ చేసి బెదిరించారు. పోలీసు డ్రెస్, వెనుక కటకటాలు కనిపించేలా చేసి అరెస్ట్‌కు వస్తున్నామంటూ రూ.25వేలు పిండేశారు. ఆ తర్వాత రోజే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో వైద్య విద్య చదువుతున్న ఓ విద్యార్థిని తండ్రికి ఫోన్ చేసి డబ్బులు గుంజడానికి ప్రయత్నించారు. తీరా సదరు వ్యక్తి ఎదురుతిరగడంతో తోకముడిచారు. 2022, సెప్టెంబర్‌లో అప్పటి కలెక్టర్ కృతికాశుక్లా ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకున్న సైబర్ నేరగాళ్లు పలువురు జిల్లా అధికారులకు మెసేజ్ చేశారు. కలెక్టర్ డీపీగా ఉన్న ఫోన్ నెంబర్‌కు అర్జెంట్‌గా డబ్బులు పంపాలని కోరారు. కొందరు అధికారులు నిజమేనను కుని డబ్బులు పంపారు. ఆ తర్వాత నేరుగా కలెక్టర్‌కు విషయం చెప్పగా అది సైబర్ నేరగాళ్ల పనిగా తేలింది. దీంతో కలెక్టర్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు యూపీనెంబర్‌గా గుర్తించారు. నిందితులు కూడా అక్కడివారేనని తేల్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలోనే ఆర్.మహేష్‌కుమార్ పేరుతో కూడా కొందరు అధికారులకు వాట్సాప్ సందేశాలను సైబర్ నేరగాళ్లు పంపించారు. ఈ ఏడాది సెప్టెంబరులో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ డీపీతో జిల్లాలో కొందరు తహశీల్దార్లకు సైబర్ నేరగాళ్లు అర్జెంట్‌గా తమ వారికి డబ్బులు పంపాలని కోరారు. ఆరా తీస్తే అది కూడా యూపీ నుంచి నేరగాళ్లు ఈ మోసానికి దిగినట్టు తేలింది. అదేనెల గండేపల్లిలో ఓ వ్యక్తి ఫోన్‌కు వచ్చిన లింకు ఓపెన్ చేయగా రూ.2.50లక్షలు బ్యాంకు ఖాతా నుంచి విత్‌డ్రా అయినట్టు మెసేజ్ రావడంతో కంగుతిన్నాడు.

ఎన్నో రకాలుగా మోసాలు

వివిధ రకాల గేమ్ యాప్‌ల నుంచి సైతం డబ్బులు సైబర్ నేరగాళ్లు జనం నుంచి లాగేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో బ్యాంకుల పేరుతో ఫోన్‌లు చేసి ఓటీపీలు తెలుసుకుని లాగేసిన డబ్బు రూ.కోట్లలో ఉంటుంది. లింకులు పంపి అవి తెరవకపోతే ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయని బెదిరించి డబ్బులు ఖాళీ చేసేసిన కేసులు అనేకం. వ్యక్తిగత వివరాలతో లోన్‌యాప్స్ ద్వారా కాల్స్‌చేసి లింక్స్‌ను ఓపెన్ చేయమని కోరడం ద్వారా సదరు వ్యక్తికి సంబంధించిన బ్యాంకు అక్కౌంట్ నుంచి సొమ్ములు స్వాహా చేసే ఘటనలు ఉన్నాయి. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో ఫేక్ ఐడీలు సృష్టించి వాటిల్లోని కాంటాక్ట్ లిస్టుకు మెసేజ్‌లు పెట్టి అర్జెంటుగా డబ్బులు వేయాలని కోరుతున్న పరిస్థితులు ఉంటున్నాయి. ఇటీవల లవ్ స్కామ్స్ ఎక్కువయ్యాయి. బాధితులు వేలల్లో ఉంటున్నారు. కానీపోయిన డబ్బులు తిరిగి రావనే కారణంతో ఫిర్యాదు చేయడానికి చాలామంది ముందుకు రావడంలేదు. పెద్దాపురంలో మోసానికి గురైన రైతు ఫిర్యాదుతో పోలీసులు గుజరాత్‌కు వెళ్లి అక్కడ ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి తీసుకువచ్చి జైలుకు పంపారు.

మూడేళ్లుగా కేసులు ఇలా..



ఏడాది	కాకినాడ	తూర్పుగోదావరి	కోనసీమ
2022	54కేసులు	-	37 కేసులు
2023	38కేసులు	103 కేసులు	97 కేసులు
2024	50కేసులు	95 కేసులు	25 కేసులు

సైబర్ నేరాలు.. ఎన్ని రకాలంటే..

నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ మొత్తం 24 రకాలను సైబర్ మోసాలుగా విభజించింది. వీటిలో ఆర్థిక లావీదేవీలతో మాత్రమే సంబంధం ఉన్నవి 15.

- **విషింగ్:** ఫోన్‌కాల్ ద్వారా సైబర్ నేరస్తులు కస్టమర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత సమాచారం సేకరించడం
- **ఆన్‌లైన్ జాబ్‌ఫ్రాడ్:** నిరుద్యోగులకు ఉద్యోగం పేరుతో నమ్మించి మోసం చేయడం
- **సెక్స్‌టింగ్:** ఫోన్ ద్వారా అసభ్యకర సందేశాలు, న్యూడ్ ఫొటోలు, పోర్న్ వీడియోలు పంపి డబ్బులు డిమాండ్ చేయడం.
- **స్మిషింగ్:** బాధితుడి ఫోన్‌కు తప్పుడు ఫోన్ నెంబర్ నుంచి సందేశం పంపి వారిని ఫోన్‌కాల్‌లోకి వచ్చేలా చేసి మాల్‌వేర్ డౌన్‌లోడ్ అయ్యేలా చేయడం
- **స్విమ్ స్వాప్ స్కామ్:** బాధితుడి ఫోన్ నెంబరుతోనే కొత్త సిమ్‌ను పొంది దాని ద్వారా ఓటీపీ సేకరించి మోసగించడం
- **డెబిట్/క్రెడిట్‌కార్డు:** డెబిట్ లేదా క్రెడిట్ కార్డు అనధికారికంగా ఉపయోగించడం.
- **ఇంపర్సేషన్ అండ్ ఐడెంటిఫికేషన్ టెస్ట్:** ఐడెంటిటీని దొంగిలించడం.. ఎలక్ట్రానిక్ సంతకం, పాస్‌వర్డ్ మోసపూరితంగా మార్చడం
- **ఫిషింగ్:** ఒక వ్యక్తి కస్టమర్ ఐడీ, పిన్, క్రెడిట్‌లేదా డెబిట్‌కార్డు నెంబరు, సీవీవీ నెంబరు మెయిల్స్ ద్వారా దొంగిలించడం
- **స్పామింగ్:** ఈమెయిల్, ఎస్ఎంఎస్,ఎంఎంఎస్‌ల ద్వారా వ్యాపార ప్రకటనల లింక్ పంపిస్తారు. డెబిట్/క్రెడిట్ కార్డుల వివరాలు కోరి డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయ్యేలా చేస్తారు.
- **రాన్‌సమ్‌వేర్:** మీ మొబైల్, కంప్యూటర్‌కు ఒక మాల్‌వేర్‌ను పంపి మీ పరికరాన్ని హాక్ చేసి ఫైల్స్, సమాచారం తస్కరించి వాటిని వెనక్కి ఇవ్వడానికి డబ్బులు డిమాండ్.
- **డాటా బ్రీచ్:** అనుమతి లేకుండా మన కంప్యూటర్‌లోని డేటా దొంగిలించడం.
- **వెబ్‌సైట్ డీఫేస్‌మెంట్:** ఒక వెబ్‌సైట్‌లోకి సైబర్ దొంగలు చొరబడి దాన్ని స్తంభింపజేస్తారు. వెబ్‌సైట్ డెవలపర్ ప్రమేయ లేకుండానే అభ్యంతరకర ఫొటోలు, వీడియోలు, సందేశాలు వంటివి ప్రచురిస్తారు.
- **సైబర్ స్క్వాటింగ్:** ఒక అధికారిక వెబ్‌సైట్‌లోని డొమైన్ నేమ్‌ను పోలిన మరొక దానితో రిజిస్టరవుతారు.దీనిద్వారా తప్పుదోవ పట్టించి వెబ్‌సైట్‌కి నష్టం కలిగేలా చేస్తారు.
- **ఫార్మింగ్:** మనం ఒక వెబ్‌సైట్‌లోకి వెళ్లాలనుకున్ననప్పుడు దాన్ని పోలిన మరో బోగస్ వెబ్‌సైట్‌లోకి తీసుకెళ్లడం.
- **క్రిప్టోజాకింగ్:** క్రిప్టోకరెన్సీల్లో పెట్టుబడులకు కంప్యూటింగ్ వనరులను అనధికారికంగా వినియోగించడం.



అసలు డిజిటల్ అరెస్టే లేదు



ఉమ్మడి జిల్లాలో మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు ఎక్కువగా యూపీ, బీహార్ నుంచే ఫోన్ కాల్స్‌చేస్తూ జనాలను భయపెట్టి డబ్బులు గుంజేస్తున్నారు. మీపై నమోదైన కేసుకు డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామంటూ భయ పెడుతున్నారు. వాస్తవానికి చట్టంలో ఎక్కడా డిజిటల్ అరెస్ట్ అనే ప్రస్తావనే లేదు. కాకపోతే పోలీసులమని చెప్తే ఎవరైనా భయపడతారనే కారణంతో ఆ పేరుతో మోసాలకు దిగుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఎవరైనా వీడియో కాల్స్ చేసి పోలీసు యూనిఫాంలో కనిపించి డిజిటల్ అరెస్ట్ అని భయపెట్టినా ఏమాత్రం భయపడకూడదని పోలీసులు చెబుతున్నారు. ఒకవేళ అలా ఫోన్ చేసి డబ్బులు బెదిరిస్తే ఏస్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నారు? తాము ఉండే స్థానిక పోలీస్‌స్టేషన్ పేరు చెప్పి అక్కడికి రండి అని గదమాయిస్తే సైబర్‌నేరగాళ్ల ఆట కట్టించవచ్చని పోలీసులు వివరిస్తున్నారు. సైబర్ నేరాలను నియంత్రించాలనే ఉద్దేశంతో ప్రజల్లో పోలీసులు విస్తృతమైన అవగాహన కల్పిస్తున్నారు.

సైబర్ నేరాలకో స్టేషన్..

రాష్ట్రంలో సైబర్ నేరాలు అంతకంతకూ పెరుగుతుండడంతో కూటమి ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ కేసులను ఛేదించడం కష్టమవుతుండడం, దానికితగ్గ సాంకేతిక పరిజ్ఞానం చాలా మంది పోలీసు సిబ్బందిలో లేకపోవడం కూడా కేసుల్లో పురోగతి కనిపించడం లేదు. పైగా అసలు నేరగాడు ఎక్కడ ఉంటాడో కూడా కనిపెట్టలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో త్వరలో జిల్లాకు ప్రత్యేకంగా సైబర్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. నేరానికి సంబంధించి దొంగలను పట్టుకోవడానికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సిబ్బందికి అందివ్వబోతోంది. కొత్త జిల్లాల్లో సైబర్ పోలీసు స్టేషన్‌ను అన్ని రకాల పరిపుష్టి చేయనున్నారు.

ఇవే కాశి పెట్టుబడులు

ఒక వ్యక్తి అవగాహన లేమి, భయం, తడబాటు, బలహీన వ్యక్తిత్వం, అత్యాశ.. వీటి కార ణంగానే సైబర్ నేరగాళ్లకు మోసం చేయడం సులభతరమవుతోంది.

- **అవగాహన లేమి:** ఎవరైనా కొత్త నెంబర్ నుంచి ఫోన్ చేసి మీకు తెలిసిన విషయాలను మిమ్మల్ని నమ్మించేలా చెప్తారు.అనంతరం మీ వ్యక్తిగత సమాచారం లేదా ఓటీపీల్లాంటివి అడుగుతారు. ఇక్కడే మీరు జాగ్రత్తగా ఉండాలి. బ్యాంకు వాళ్లు ఓటీపీలు అడగరు.
- **తడబాటు :** కొందరికి తడబాటు ఎక్కువ. ఫోన్ వచ్చిన వెంటనే అటువైపు ఎవరు మాట్లాడుతున్నారో చూడరు. అడిగినవి చెప్పేస్తుంటారు. అదే సైబర్ నేరస్తుల పెట్టుబడి. అలా చేయకూడదు.
- **బలహీన వ్యక్తిత్వం:** కొందరికి బలహీన వ్యక్తిత్వం ఉంటుంది. తమతో ప్రేమగా మాట్లాడేవారు లేరని ఫీలవుతూ ఉంటారు. వీరికి ఒక అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి మాట్లాడి పరిచయం పెంచుకుని మోసం చేయొచ్చు. అందువల్ల బలహీన వ్యక్తితం ప్రమాదం.
- **అత్యాశ :** ఇది చాలా ప్రమాదకరం. మీకు గిఫ్ట్ వచ్చిందని, లాటరీ తగిలిందని ఫోన్‌కాల్ లేదా మెసేజ్ వస్తే వీళ్లు ఆగలేరు. ఆ సొమ్ము పొందాలని ఎంతకైనా తెగిస్తారు. అలా రూ.లక్షల్లో పోగొట్టుకుంటున్నారు.
- **భయం:** చాలామంది చిన్నచిన్న తప్పులు చేస్తుంటాం అనే భయం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే డిజిటల్ అరెస్టుల పేరుతో వీరు మోసపోతున్నారు.

ఏంటీ లవ్‌స్కామ్!



ఇటీవల యువతతోపాటు మధ్య వయస్కులు, గృహిణులను టార్గెట్ చేసి సైబర్ నేరస్తులు రెచ్చిపోతున్నారు. ట్రాప్ చేసి డబ్బులు లాగేయడమే వారి లక్ష్యం.. 'లవ్‌స్కామ్' పేరు ఈ మధ్య ఎక్కువగా వినిపిస్తోంది. ఒంటరి మహిళలు, పురుషులు ఈ కేసుల్లో చిక్కుకుంటున్నారు.

డేటింగ్ యాప్స్ : డేటింగ్ యాప్స్ ఈ మధ్య బాగా ప్రాచుర్యం పొందాయి. యువత వీటి మోజులో పడి కొత్తవారితో పరిచయం వైపు పరుగులు పెడుతున్నారు. ఇలా డేటింగ్ యాప్స్ ద్వారా పరిచయమైన అమ్మాయి మొదట్లో ఫోన్ సంభాషణలు జరుగుతాయి. కొన్నాళ్లు నచ్చినట్లు మాట్లాడతారు. ఏదొక అవసరం పేరు చెప్పి డబ్బులు లాగేస్తారు.

మ్యాట్రిమోనీ స్కామ్ : పెళ్లి కాని చాలా మంది యువతీ, యువకులు మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌ల్లో తమ వివరాలు నమోదు చేస్తారు. సైబర్ నేరస్తులు వీరిపై కన్నేస్తున్నారు. వెబ్‌సైట్‌లో వాళ్లు కూడా ఫేక్ ప్రొఫైల్ ద్వారా ఒకరిని పరిచయం చేసుకుని కొన్నాళ్లు ప్రేమగా మాట్లాడతారు. నమ్మించి రూ.లక్షల్లో లాగేస్తారు.

ప్యాకేజ్ స్కామ్ : విదేశాల నుంచి మీతో ఒక వ్యక్తి ప్రేమగా మాట్లాడుతున్నట్టుగా నటిస్తారు. మీకు రూ.కోట్ల విలువైన పార్సిల్ పంపినట్టు కస్టమర్ కేర్ నుంచి ఒక ఫోన్ కాల్ చేయిస్తాడు. దీనికి కస్టమ్స్ క్లియరెన్స్‌కు డబ్బులు కట్టాలని రూ.లక్షల్లో దోచేస్తున్నారు.

హెల్త్ స్కామ్ : ఆస్పత్రులు, ఆలయాల వద్ద జరిగే స్కామ్ ఇది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి వ్యాధి త్వరగా నయం కాదు. కానీ కొందరు వీరిని గమనించి ఓ డాక్టర్ వద్దకు తీసుకెళ్తారు. ఆయన ట్రీట్‌మెంట్ పేరుతో పెద్ద మొత్తంలో లాగేస్తాడు.

వీడియో కాల్స్ : అపరిచిత వ్యక్తినుంచి ఒక మెసేజ్ వస్తుంది. దానికి మనం రిప్లై ఇస్తే వారి నుంచి సాంత్వన పొందేలా మెసేజ్‌లు వస్తుంటాయి. తర్వాత న్యూడ్ వీడియో కాల్ చేస్తారు. మీ శరీర బలహీనతను ఆసరాగా చేసుకుని మీరు కూడా న్యూడ్‌గా ఉండేలా చేస్తారు. మీ వీడియో రికార్డ్ చేస్తారు. డబ్బులు పంపకపోతే ఆ వీడియో వైరల్ చేస్తామని భయపెడ్తారు.

ఇవి పాటించండి..

- ఒక కొత్త నెంబరు నుంచి ఫోన్ కాల్ లేదా మెసేజ్ వస్తే రెస్పాండ్ కాకండి.
- మీ వ్యక్తిగత వివరాలు ఆధార్, పాన్, బ్యాంకు అకౌంట్, ఏటీఎం,ఏ సమాచారం వంటివి ఎవరికీ షేర్ చేయకండి.
- మీ మొబైల్‌లో కూడా సెక్యూరిటీ సెట్టింగ్స్ జాగ్రత్తగా చూసుకోండి. యాప్స్ డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు పర్మిషన్ ఇచ్చే ముందు జాగ్రత్త వహించండి.
- న్యూడ్ వీడియో కాల్స్ లేదా బెదిరింపు వీడియో కాల్స్ వచ్చినప్పుడు ఎదుటివారికి భయపడకుండా వారిని గట్టిగా ప్రతిఘటించండి.

సైబర్ క్రైమ్‌కు కాల్ 1930

ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే బాధితులు వెంటనే 1930 టోల్‌ఫ్రీకి ఫోన్ చేయాలి. ఇందులో సైబర్ నేరానికి సంబంధించిన వివరాలు నమోదు చేయాలి. దీనిద్వారా స్థానిక పోలీసులు వెంటనే సైబర్ కేసు నమోదు చేస్తారు. మొదటగా ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్ జరగకుండా ఆపే ప్రయత్నం చేస్తారు. ఫోన్ కాల్స్‌లో బెదిరించి డబ్బులు గుంజుతున్న నేరగాళ్లపై పోలీసులు 318(4), బీఎన్ఎస్ 66 ఐటీఏ 2000-2008 చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నారు. ఈ కేసు కింద నిందితులకు గరిష్ఠంగా ఏడేళ్లకుపైగా జైలుశిక్ష, జరిమానా విధించవచ్చు.

ఏకాదశ రుద్రుల దర్శనానికి తరలివచ్చిన భక్తజనం

బస్సుల్లో మూడు వేల మంది భక్తుల రాక



గంగలకుర్రు అగ్రహారంలో శివకేశవులను దర్శించుకుంటున్న భక్తులు

అంబాజీపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరి సోమవారం, మాస శివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఏకాదశ రుద్రులను దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొవ్వూరు, తాడేపల్లిగూడెం, రావులపాలెం, తణుకు తదితర డిపోల నుంచి 20బస్సుల్లో 2000మంది, ఇతర ప్రాంతాల నుంచి వెయ్యి మందికిపైగా ఏకాదశ రుద్రుల స్వామివార్ల దర్శనానికి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలంలోని గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు, మొసలపల్లి, కె.పెదపూడి, ఇరుసుమండ, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, వక్కలంక, ముక్కామల, అమలాపురం మండలం పాలగుమ్మి, అయినవిల్లి మండలం నేదునూరు గ్రామాల్లోని వివిధ రూపాల్లో ఉన్న శివున్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఒకే రోజున ఏకాదశ రుద్రులను దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పేర్కొన్నారు. భక్తులకు ఆయా గ్రామాల్లో ప్రసాదాలు, బాదంపాలు అందించారు.

మట్టి పార్థివ లింగాలకు లక్ష బిల్వార్చన

ఆరికరేవులలో ఆధ్యాత్మిక కార్యక్రమం



ఆరికరేవులలో మట్టి ఉమా పార్థివేశ్వర శివలింగాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బిక్కవోలు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం ఆరికరేవుల గ్రామంలోని శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం ఆఖరి సోమవారం సందర్భంగా 54మట్టి పార్థివ లింగాలకు ఘనంగా లక్ష బిల్వార్చన, అభిషేకాలు జరిపారు. ముందుగా పార్థివ లింగాలను, విశ్వేశ్వర స్వామిలకు గ్రామోత్సవం జరిపారు. అనంతరం ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్లకు లక్ష బిల్వార్చన, మహిళలతో సామూహిక లక్ష కుంకుమార్చనలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తొండాపు సూర్యనారాయణరెడ్డి లత దంపతులు, సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి, సభ్యులు ఇందల వీరబాబు, రెడ్డి శ్రీను, నాగదేవర సత్తిబాబు, కొర్ల భజనశ్రీను తదితరులు పాల్గొన్నారు. బిక్కవోలులో ప్రాచీన గోలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. స్వామికి లక్ష బిల్వార్చన, పార్వతి అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిపారు. కొంకుదురు బుడతలమామిడి వద్ద త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయం, ఊలపల్లి అగస్త్యేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.



బిక్కవోలులో లక్ష బిల్వాలతో గోలింగేశ్వరుడు

గుడిమెళ్లంక విచ్చేసిన భారతీ మహాస్వామి

శివాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



గుడిమెళ్లంకలో శివాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న విధుశేఖరభారతీ మహాస్వామి

మలికిపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గుడిమెళ్లంక గ్రామంలో శృంగేరీ పీఠాధిపతి విధుశేఖరభారతీమహాస్వామి శివాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, నాయకులకు ఆయన దర్శనభాగ్యం కల్పించారు. వారితో పాటు భక్తులు కూడా ఆయన్ను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం సాయంత్రం వేద సభ నిర్వహించారు. నియోజకవర్గం నాలుగు మూలల నుంచి గుడిమెళ్లంక గ్రామంలో ఉన్న భారతీమహాస్వామిని చూసేందుకు తరలివచ్చారు. లక్కవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. అనంతరం వచ్చిన భక్తులకు అల్పాహారం, భోజన ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో శంకరమఠం పీఠాధిపతి మంగళంపల్లి సాయిరామ్, శంకరమఠం సీఈవో మంగళంపల్లి కార్తీక్‌శర్మ శంకరమఠంలో ఇంతటి గొప్ప దైవ కార్యక్రమాలు జరగడానికి కారకులైన సుబ్రహ్మణ్యశర్మను పలువురు అభినందించారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట రామరెడ్డి

ప్రాథమిక స్థాయిలో అభ్యసన సామర్థ్యాలపై దృష్టి సారించాలి

దివాన్‌చెరువు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని కాకినాడ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి వెంకటరామరెడ్డి పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం కొండగుంటూరులో ఎఫ్ఎల్ఎన్ మూడో దశ శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏఎంవో రామరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఆరు రోజులు శిక్షణ ఇస్తామన్నారు. జిల్లాల వారీగా... కాకినాడ నుంచి 90 మంది, కోనసీమ నుంచి 90 మంది, తూర్పు గోదావరి నుంచి 70 మంది హాజరవుతున్నారన్నారు. కీ రిసోర్స్‌పర్సన్‌గా కె.మహేల వ్యవహరిస్తున్నారు.


ఉప్పాడ వద్ద ఎగసిపడుతున్న కెరటాలు

ఉప్పాడ తీరంలో ఎగసిపడుతున్న అలలు

కొత్తపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో సముద్ర కెరటాలు ఎగసిపడుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం నుంచి ఈదురుగాలులు తీవ్రత ఎక్కువగా ఉండడంతో అలలు ఒడ్డుకు దూసుకొస్తున్నాయి. ఈదురుగాలులకు సముద్రం ఉప్పొంగుతోంది. కొత్తపట్నం నుంచి నేమాం సరిహద్దు వరకు బీచ్ రోడ్డుపైకి రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. ఆ మార్గంలో ప్రయాణించేందుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రయాణికులను కొత్తపల్లి పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు.


సత్యదేవుని దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

రత్నగిరి... భక్తజనసిరి

» కార్తీక మాసం చివరి సోమవారం సత్యదేవుని దర్శనానికి పోటెత్తిన భక్తులు » ఒక్క రోజు రూ.కోటి ఆదాయం

అన్నవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారానికి తోడు దశమి పర్వదినం కావడంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి భక్తులు పోటెత్తారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని తెల్లవారుజామున ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్... సీసీ టీవీల ద్వారా క్యూలైన్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి పలు సూచనలిస్తూ, భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటలు పట్టింది. సుమారు 90వేల మంది భక్తులు స్వామిని దర్శించుకోగా 10,500 జంటలు వ్రతాలు ఆచరించారు. వివిధ విభాగాల ద్వారా సుమారు కోటి రూపాయల ఆదాయం సమకూరింది. అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి సోమవారం ముగ్గురు దాతలు విరాళాలు సమర్పించారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరుకు చెందిన తేతల శ్రీనివాసరెడ్డి రూ.లక్ష, ఏలూరు జిల్లా మండవిల్లికి చెందిన మానుకొండ నాగేశ్వరరావు రూ.1,00,116 ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్‌కు అందజేశారు. దాతలను స్వామివారి ప్రత్యేకదర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం పులిమేరుకు చెందిన డి.వెంకటశ్రీను, వెంకట సూర్యనారాయణ సంయుక్తంగా రూ.1,00,116 అన్నదానం విభాగం సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్‌కు అందజేశారు.


సూపరింటెండెంట్ సత్యశ్రీనివాస్‌కు విరాళం అందజేస్తున్న నాగేశ్వరరావు


సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్‌కు విరాళం అందజేస్తున్న వెంకటశ్రీను, సూర్యనారాయణ


సూపరింటెండెంట్ సత్యశ్రీనివాస్‌కు విరాళం అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

అన్నవరం దేవస్థానం ఈవోగా
త్రినాథరావు



అన్నవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఈవోగా వేండ్ర త్రినాథరావును నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనరు సత్యనారాయణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈవోగా వున్న కె.రామచంద్రమోహన్ దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనరుగా పనిచేస్తుండడంతో పని భారం తగ్గించాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. అన్నవరం ఈవోగా గతంలో మూడేళ్ల పనిచేసిన అనుభవం త్రినాథరావుకు ఉండడంతో దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఆయన్ను ప్రతిపాదించారు. ప్రస్తుతం సింహాచలం దేవస్థానం ఈవోగా కొనసాగుతున్న ఆయనకు అన్నవరం దేవస్థానం బాధ్యతలను అదనంగా అప్పగించారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

అన్నవరం దేవస్థానం సీఆర్వో విభాగ సూపరింటెండెంట్‌గా కృష్ణప్రసాద్‌ను బదిలీ చేస్తూ ఈవో రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు. సుబ్రహ్మణ్యానికి అన్నదానం బాధ్యతలు అప్పగించారు.


కోడిని చుట్టుముట్టిన కొండ చిలువ

చేబ్రోలులో కొండచిలువ
కలకలం

గొల్లప్రోలు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలోనిరథంబాట సమీపంలో ఎర్రబంద చెరువు వద్ద కొండ చిలువ రెండు రోజులుగా కలకలం సృష్టిస్తోంది. సోమవారం చెరువు వద్ద కోడిని చుట్టుముట్టి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో సమీపంలోని రైతులు అప్రమత్తమై ఆ ప్రాంత పరిసరాల్లో తిరుగుతున్న విద్యార్థినీ, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. కొండచిలువను పట్టుకుని ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు రేపు
స్క్రీనింగ్ పరీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న ఉమ్మడి తూర్పు గోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని అభ్యర్థులకు బుధవారం స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకురాలు కేవీఎన్ జ్యోతి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సమీపంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డుతో ఉదయం పది గంటలకు బీసీ స్టడీ సర్కిల్ వద్దకు రావాలన్నారు.

లైంగిక వేధింపులతో వివాహిత ఆత్మహత్య

ద్రాక్షారామ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులతో మనస్థాపం చెందిన ఓ వివాహిత ఉరి వేసుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వేగాయమ్మపేటకు చెందిన వివాహిత గుత్తుల రమ్యశ్రీ (24)ను ఆమె ఇంటి సమీపంలో ఉన్న మేడిశెట్టి దుర్గాప్రసాద్ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో మనస్థానం చెందిన రమ్యశ్రీ సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


డంప్‌లో ఉంచిన లోడింగ్ యంత్రాలు

లోడింగ్ ఏజెన్సీ నిర్లక్ష్యం

» తరచూ డీజిల్ లేదనే సాకుతో నామమాత్రంగా ఇసుక విక్రయాలు » ప్రభుత్వ ఆదాయానికి గండి » పట్టించుకోని అధికారులు

ఎటపాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలోని గుండాల డంప్-1లో లోడింగ్ ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగా ఇసుక అమ్మకాలు మందకొడిగా సాగుతున్నాయి. ఇటీవల లోడింగ్ ఏజెన్సీ ఇసుక విక్రయాలకు సహకరించట్లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నారు. యంత్రాల్లో డీజిల్ కొరత అంటూ తరచూ నామమాత్రంగానే లోడింగ్ చేస్తున్నారు. దాంతో ఇసుక కోసం వస్తున్న లబ్ధిదారులు గంటల కొద్దీ వేచి ఉండి లోడింగ్ చేసుకోకుండానే తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గుండాల డంప్-1లో ఇసుక లోడింగ్ ఏజెన్సీ కాంట్రాక్టు దక్కించుకున్న వారు ఇటీవల ఇదే తీరుని అనుసరిస్తున్నారు. దాంతో ఇసుక విక్రయాలు అనుకున్నంత స్థాయిలో జరగట్లేదు. సుదూర ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ఇసుక కోసం ఇక్కడకు వస్తే దొరకట్లేదు. దాంతో ఇసుక అవసరమున్న వారు బ్లాక్ మార్కెట్‌లో ట్రాక్టర్ లోడ్‌ని రూ.3వేల నుంచి రూ.3,500 వెచ్చించి కొనుగోలు చేసుకుంటున్నారు. కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఉచిత ఇసుక పాలసీ అభాసుపాలవుతోంది. ఈ పథకం సక్రమంగా అమలు కావట్లేదన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. అధికారుల దృష్టికి ఈ విషయం వెళ్లినా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. మరోవైపు లోడింగ్ ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆదాయానికి కూడా గండి పడుతోంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి లోడింగ్ ఏజెన్సీని మార్చాలని స్థానికులతో పాటు టీడీపీ కార్యకర్తలు కోరుతున్నారు.

ఈ విషయమై తహసీల్దారు కారం సుబ్బారావును వివరణ కోరగా... లోడింగ్ ఏజెన్సీ ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందని... వారిని పిలిచి మందలించినట్టు వివరించారు. మరోమారు ఇలా వ్యవహరిస్తే ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని చెప్పారు.


దీపాల సంబరంలో భాగంగా కార్తీక దీపం వెలిగిస్తున్న ఈవో సౌజన్య

కరపలో ఘనంగా దీపాల సంబరం



కరప, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో సోమవారం రాత్రి కార్తీక దీపాల సంబరం ఘనంగా జరిగింది. పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ సంస్థానం కార్యనిర్వహణాధికారిణి సౌజన్య కార్తీక దామోదరునికి పూజలు చేసి దీపోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు తరలివచ్చి భక్తితో దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. టీడీపీ నేత కోటగిరి మహేంద్రబాబు స్వామివారిని దర్శించుకుని కోటి దీపోత్సవంలో పాల్గొన్నారు. కూరాడలో కూడా కార్తీక దీపాల సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ తోట సునీత, ఏఎస్ఐ సూరిబాబు, ఇతర సిబ్బంది అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శివనాగబాబు

కుమారుడిని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా...

స్కూటీని ఢీకొన్న వ్యాన్... తండ్రి అక్కడికక్కడే మృతి

గండేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్కూటీని ఎదురుగా వచ్చిన వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రామేశ్వరంపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామానికి చెందిన తాటిపాక గంగరాజు (28) తన భార్య, పిల్లలతో రంగంపేట గ్రామంలోని కోళ్ల ఫారంలో నివాసముంటున్నాడు. కుమారుడు అనిల్‌కు ఆరోగ్యం బాగా లేకపోవడంతో సోమవారం ఆనూరు హాస్పిటల్‌కు స్కూటీపై తీసుకుని వెళ్తుండగా రామేశ్వరంపేట వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొంది. గంగరాజు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు అనిల్ కాలుకి గాయమైంది. గంగరాజు భార్య సునీత ఫిర్యాదు మేరకు గండేపల్లి ఎస్ఐ యూవీ శివనాగబాబు కేసు నమోదు చేశారు. ఆయన ప్రమాద స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు.


క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ బూరా రామ్‌భైరవ, ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఏకలవ్య పాఠశాల విద్యార్థుల ప్రతిభ

జాతీయ స్థాయి పోటీలకు 15 మంది ఎంపిక

వై.రామవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరిలో ఈనెల 21, 22 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో వై.రామవరం మండలం పి.యర్రగొండ ఏకలవ్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-19లో బాక్సింగ్, బ్యాడ్మింటన్, షాట్‌పుట్, వెయిట్ లిఫ్టింగ్, చెస్, డిస్కస్‌త్రోల్లో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ బూరా రామ్‌భైరవ తెలిపారు. 39 మంది విద్యార్థులు పాల్గొనగా 18 మంది పతకాలు గెల్చుకున్నారని చెప్పారు. వీరిలో 15 మంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులతో పాటు వారికి తర్ఫీదు ఇచ్చిన పీఈటీలు ప్రశాంత్‌కృష్ణ, ప్రసాద్, సాగర్‌లను ప్రిన్సిపాల్ అభినందించారు.


పొలమూరులో యాత్రను ప్రారంభిస్తున్న అయ్యప్ప మాలధారులు

శబరిమలైకు సైకిల్‌పై....

ముగ్గురు అయ్యప్ప దీక్షాధారుల యాత్ర

అనపర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన ముగ్గురు స్వాములు శబరిమలైకు సైకిల్ యాత్ర చేపట్టారు. చిట్టూరి నాగమణికంఠ, వానపల్లి సూర్య జనార్దన్, మల్లెల వీరబాబు శబరిమలైకు సైకిల్‌పై వెళ్లాలని సంకల్పించారు. సోమవారం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిపి యాత్రను ప్రారంభించారు. పలువురు అయ్యప్ప దీక్షాధారులు సంఘీభావం తెలుపుతూ వారికి వీడ్కోలు పలికారు. సుమారు 1,400 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణం చేసి స్వామి సన్నిధిలో ఇరుముడులు సమర్పించనున్నారు.


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులను చూపిస్తున్న కిర్లంపూడి ఎస్ఐ

163 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్టు... 14 రోజులు రిమాండ్ విధించిన కోర్టు

కిర్లంపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామ జాతీయ రహదారిపై ఒక వాహనంలో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా రాజమహేంద్రవరం వైపు వెళ్లే దారిలో మహేంద్ర గూడ్స్‌లో గంజాయి తరలిస్తుండడాన్ని కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్, పోలీసు సిబ్బంది గుర్తించారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా నాలుగు బస్తాల్లో 163 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ గంజాయిని ఏజెన్సీ నుంచి చెన్నై తరలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. తమిళనాడుకు చెందిన రంగస్వామి సత్యానందం, నవమని గురుస్వామిలను అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేసి ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్ఐ చెప్పారు.

ఎమ్మెల్యే రాజప్ప ప్రత్యేక పూజలు

పెద్దాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న సిద్ధి వినాయక, షిరిడీ సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో ఆలయంలో నిర్వహించిన లక్ష జ్యోతిర్లింగార్చన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ప్రసాదాలను స్వీకరించారు.

మారుమోగిన శివనామస్మరణ

పాదగయకు పోటెత్తిన భక్తులు

ప్రత్యేక పూజలు, అభిషేకాలు

కిటకిటలాడిన శివాలయాలు





పాదగయ క్షేత్రంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, నందీశ్వరుడికి జలాభిషేకం, గొల్లప్రోలు శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

పిఠాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రం సోమవారం శివనామస్మరణతో మారుమోగింది. కుక్కుటేశ్వర స్వామికి లక్షపత్రిపూజ, రాజరాజేశ్వరీదేవికి కుంకుమార్చన నిర్వహించారు. కార్తీక మాసం నాల్గో సోమవారం, దశమి కలిసి రావడంతో పాదగయ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. భక్తుల రాక తెల్లవారుజామున ప్రారంభమై రాత్రి వరకూ కొనసాగింది. పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామికి పంచామృత మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం వరకూ ఉపవాసం ఉన్న మహిళలు, భక్తులు ఆలయంలో దీపాలు వెలిగించి కార్తీక నోము ఆచరించారు. కుక్కుటేశ్వరస్వామికి సాయంత్రం లక్షపత్రిపూజ జరిగింది. రాజరాజేశ్వరదేవి, పురుహూతికాఅమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించి మహిళలు పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు తదితరులు ఏర్పాట్లు చేపట్టారు.



గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రత్యేక అలంకరణలో ఉమారామలింగేశ్వరస్వామి

భీమేశ్వరాలయంలో పూజలు

సామర్లకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మహాపర్వదినాలు ఇరవై నాల్గవ రోజు పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున గోపూజలను ప్రారంభించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న తదితరుల వేదమంత్రోచ్ఛారణల మధ్య అభిషేక, పుష్పార్చన పూజలు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచీ అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి,అమ్మవార్లను దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. శ్రీపాద రాజశేఖర ఘనాపాఠి నేతృత్వంలో లక్షపత్రి పూజల్లో సామర్లకోటకు చెందిన పారిశ్రామికవేత్త అంబటి సుబ్రహ్మణ్యం దంపతులు ఆశీనులయ్యారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద జరిగిన ఆకాశదీప పూజల్లో అంబటి సుబ్రహ్మణ్యం దంపతులు, భక్తులు ఆశీనులయ్యారు. కార్తీకదీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చన పూజలు చేశారు. నిత్యాన్నదాన పథకంలో భాగంగా ఆలయ ఆవరణలో సుమారు 4,000 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప భీమేశ్వరస్వామికి, బాలాత్రిపురసుందరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కరప: కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో భక్తజనం శివాలయాలకు పోటెత్తారు. కరప పర్వతవర్ధినీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకులు విలపర్తి శ్రీనివాస్, పణిరాజులు స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన, తదితర పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెనుగుదురు, వేళంగి, వాకాడ, వేములవాడ, గొర్రిపూడి, నడకుదురు, గురజనాపల్లి, కూరాడ, పెద్దాపురప్పాడు, కొరుపల్లి, అరట్లకట్ట, తదితర గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

గొల్లప్రోలు: పట్టణంలోని శివాలయంలో ఉమారామలింగేశ్వరస్వామికి కార్తీక సోమవారం, మాసశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. రాత్రికి ఆలయం వద్ద దీపాలంకరణ సేవ జరిగింది. మండలంలోని తాటిపర్తి గ్రామంలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. కోనేరులో శివలింగానికి ప్రత్యేక పూజలు జరిగాయి.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయం భక్తజనసంద్రమైంది. దశమి, కార్తీక సోమవారం కలిసి రావడంతో తెల్లవారుజామున 2గంటల నుంచి భక్తుల రాక ప్రారంభమయింది. ప్రదక్షిణలు చేసి స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఉమారామలింగేశ్వరస్వామికి పుష్పాలతో ప్రత్యేక అలంకారం చేశారు. స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఉమాదేవి, లలితాదేవి అమ్మవార్లకు కుంకుమపూజలు నిర్వహించారు. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించగా, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు చేబ్రోలు శివాలయంలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి విశేషపూజలు జరిగాయి.

తాళ్లరేవు: కోరింగ పంచాయతీ చినబొడ్డువెంకటాయపాలెంలో టీడీపీ నాయకురాలు పెమ్మాడి కృష్ణవేణి ఆధ్వర్యంలో ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. మహిళలు ఆశీర్వాదాలను స్వీకరించారు.

జాతీయ ప్రచార కార్యక్రమం విజయవంతం చేయాలి

కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో చట్టాలను ప్రజలకు తెలియజేయడంతోపాటు లింగ వివక్షత గురవుతున్న మహిళలు, చిన్న పిల్లలు, యువతీ యువకులకు చట్టం పరిధిలో ఉన్న అన్ని అవకాశాలను, చట్టాలపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ పిలుపునిచ్చారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా డీఆర్డీఏ అధికారులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమం సోమవారంనుంచి డిసెంబరు 23వరకు జిల్లాలో నిర్వహిస్తారన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు : ఆర్డీవో

పెద్దాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం అవగాహనా కార్యక్రమం ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి అధ్యక్షతన డిప్యూటీ డీఎంహెచ్‌వో పి.సరిత అధ్యక్షతన నిర్వహించారు. వైద్యపరీక్షలను లింగ నిర్ధారణా పరీక్షలకు ఉపయో గించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అనూషారాయ్, సత్యవంశీ, సాయిరోహిత, రాజేశ్వరి, అడ్వకేట్ కేవీ చలం, ఎన్జీవో సభ్యురాలు వాసవి, సత్యరవికుమార్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి : సీఐ

కాకినాడ క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులకు శిరోధారణ తప్పనిసరని కాకినాడ ట్రాఫిక్ సీఐ ఎస్.రమేష్ అన్నారు. కాకినాడ మెయిన్‌రోడ్డులోని జిలాని పాన్‌షాప్ వద్ద హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు సోమవారం అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మోటారుసైకిల్ నడిపే ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, బైక్‌స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ ఎట్టి పరిస్థితిలో చేయరాదన్నారు. 112, 1930 టోల్ ఫ్రీ కాల్స్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్- 1,2 ఎస్ఐలు కిషోర్‌కుమార్, వెంకటరత్నం పాల్గొన్నారు.

'డిజిటల్ లావాదేవీలపై అవగాహన తప్పనిసరి'

పిఠాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులకు డిజిటల్ లావాదేవాలపై అవగాహ తప్పనిసరి అని మెప్మా సీఎంఎం వెంకటలక్ష్మీ అన్నారు. సోమవారం పిఠాపురం మెప్మా కార్యాలయంలో చిరు వ్యాపారులకు, మెప్మా సిబ్బందికి సమావేశం నిర్వహించారు. పీఎంజేవై, ఎస్‌బీవైపై అవగాహ కల్పించారు. స్వానిధి రుణాలు, సామాజిక భద్రతపై, డిజిటల్ లావాదేవీలు ఏ విధంగా నిర్వహించాలో ఆమ తెలిపారు. కార్యక్రమంలో శైలజా, సాల్మ కుమారి, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య డెవలపర్స్ ప్రారంభం

కాకినాడ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ శ్రీనగర్‌లో ఆదిత్య డెవలపర్స్ పేరుతో ఏర్పాటుచేసిన కార్యాలయాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం సంస్థ మొదటి బ్రోచర్‌ను లక్ష్మీరాజ్యం ఆవిష్కరించారు. శేషారెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికీ సొంతింటి కల అనేది ఉంటుందని దానిని సాకారంచేసుకోవడం అందరికీ సాధ్యపడడం లేదని అలాంటి వారికి అన్ని విధాలుగా అందుబాటులో ఉండే విధంగా వెంచర్స్ డవలప్‌చేసి అందించాలనే లక్ష్యంతో ఆదిత్య గ్రీన్ సిటీ పేరుతో 34 ఎకరాల సువిశాల గ్రీన్ సిటీ వెంచర్‌ను పెద్దాపురంలో ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఆదిత్య యూనివర్శిటీ వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి, భీమేశ్వరరెడ్డి, వీరభద్రారెడ్డి ఉన్నారు.

'నీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలి'

కాకినాడ సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలం భీమవరపుకోటలో పూర్వం నుంచి బోరు నీరు, కాలువ నీరు పోయే కాలువ స్థలం వద్ద నీరు బయటకు పోకుండా అడ్డుగా గోడ కట్టారని, కాలువ ద్వారా నీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపకుడు ఆరుగుల మోషే, కాపారపు రత్నం, కుందూరు ప్రేమ్‌కుమార్ కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేసి జేసీకి వినతిపత్రం సమర్పించారు.

కార్తీక వన సమారాధనలు

కరప, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో పలు గ్రామాల్లో వనసమారాధన వేడుకలు ఘనంగా జరిగాయి. గొడ్డటిపాలెం, పేపకాయలపాలెం, గొర్రిపూడి, నడకుదురు, తదితర గ్రామాల్లో వనసమారాధనలు నిర్వహించారు. గ్రామస్తులంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఉసిరిచెట్లకు పూజలు నిర్వహించి అన్నదానం ఏర్పాటుచేశారు. గొడ్డటిపాలెం వనసమారాధనలో ఏర్పాటుచేసిన శివలింగం ఆకర్షణగా నిలిచింది.

వైద్యురాలిగా బాధ్యతలు

పిఠాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలిగా బీఎస్ కీర్తన సోమవారం విధుల్లో చేరారు. జాయినింగ్ రిపోర్టు ప్రధాన వైద్యాధికారి సుజాతకు అందజేశారు. ఇదే ఆసుపత్రిలో కీర్తన తల్లిదండ్రులు ఇద్దరూ వైద్యులుగా పనిచేశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని వ్యాప్తి చేయాలి

విద్య జోన్-2 ఆర్జేడీ నాగమణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ

కాకినాడ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నతమైన విజయాలు సాధించాలని పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. భారతరాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కాకినాడ మహాత్మ గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం కాకినాడ జోన్-2 పరిధిలో గల 7జిల్లాల పాఠశాలల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, రాజ్యాంగం కోసం పరుగు, డిబేట్, దేశభక్తి గేయాల పోటీలను నిర్వహించారు. మొత్తం 105 మంది విద్యార్థులు పాల్గొనగా బహుమతి ప్రదానోత్సవంలో ఆర్జేడీ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ విద్యార్థులు భారతరాజ్యాంగ స్ఫూర్తిని వ్యాప్తిచేయాలని సూచించారు. విజేతలకు ప్రతిభాపత్రాలు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి డీవైఈవో ఎన్.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా విద్యాశాఖ సహాయసంచాలకులు వీఎస్.మూర్తి, పర్యవేక్షకులు జె.కృష్ణార్జునచౌదరి, బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరిశ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, రత్నప్రసాద్ పాల్గొన్నారు.

పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌ను అమలు చేయాలి

డీఎంహెచ్‌వో నరసింహనాయక్



తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో బృందం

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏఆర్‌టీ(అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీస్), సరోగసీ, పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌ను జిల్లాలో ప్రతిష్టంగా అమలు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. ఏఆర్‌టీ లెవెల్-2కు నూతనంగా నమోదు చేసుకున్న ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్‌ను ఏఆర్‌టీ డిస్ట్రిక్ట్ టీమ్ సోమవారం తనిఖీ చేసిందని తద్వారా ఆ సెంటర్ అప్రూవల్ కోసం జిల్లా మీటింగ్‌లో కలెక్టర్ ఆమోదించి సదరు సెంటర్‌కు పర్మిషన్ ఇస్తామన్నారు. లెవెల్-1, 2 ప్రొసీజర్లు రిజిస్టర్ కాకుండా గూగుల్, వాట్సప్, టెలీగ్రాం, పోస్టర్లు యూట్యూబ్, ప్లాంప్లెట్స్, గోడపత్రికలు, హోర్డింగ్‌ల ద్వారా ఏఆర్‌టీ, సరోగసీ రిజిస్టర్ కాని సెంటర్లు ప్రకటనలు ఇస్తే అటువంటి యాజమాన్యం చట్టరీత్యా శిక్షార్హులని డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ తనిఖీలో డీఎంహెచ్‌వోతోపాటు జీజీహెచ్ నుంచి పాథాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్, రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత, గైనకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వంశీప్రియ, డాక్టర్ సపురా, డెమో ప్రసాద్‌రాజు ఉన్నారు.

విస్తృత ప్రచారం చేయాలి



ప్రసంగిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

సామర్లకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జీవసేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక వ్యవసాయోత్పత్తులను సాధించేలా రైతులకు విస్తృత ప్రచారం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ పేర్కొన్నారు. సామర్లకోట మండలం నవర గ్రామంలో ఇండిగ్యాప్ పొలంబడి క్షేత్రదినోత్సవం మండల వ్యవసాయాధికారిణి ఐ.సత్య అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ ఏడీఏ రత్నప్రశాంతి మాట్లాడుతూ 14 వారాలపాటు జరిగిన పొలంబడి ప్రాముఖ్యతను వివరించారు. జీవసేంద్రియ వ్యవసాయం చేసి సత్ఫలితాలు సాధించిన రైతులను విజయకుమార్ చేతులమీదుగా సత్కరించారు. కార్యక్రమంలో నవర పరిసర గ్రామాలకు చెందిన రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల ఆందోళన

కొత్తపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి శివారు రవీంద్రపురంలో చేనేత కార్మికుల ఉమ్మడి పడుగుసరులు, హల్లులు పట్టుకునే ఖాళీ స్థలాన్ని ప్రవేటు సర్వేయర్ ఆక్రమించి గ్రావెల్ డంప్ చేయడంతో స్థానిక చేనేత కార్మికులు సోమవారం ఆందోళన చేపట్టారు. అధికారులు తక్షణం స్పందించి గ్రావెల్ డంపింగ్ నిలిపివేశారు. ప్రవేటు సర్వేయర్‌పై చర్యలు చేపట్టాలని రవీంద్రపురం రామలింగేశ్వరకాలనీ చేనేత కార్మికులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతోవీఆర్వో ప్రకాష్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఏ పనులు చేపట్టరాదని హెచ్చరించారు.

'బడ్డీ కొట్టును తొలగించాలి'

సర్పవరం జంక్షన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట శ్రీపీఠం వెనుకాల రోడ్డులో అక్రమంగా రోడ్డు ఆక్రమించి ఇనుప బడ్డీ కొట్టు ఏర్పాటు చేశారని, దీనిని తక్షణమే తొలగించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్లు నిమ్మన వెంకటరాజు తెలిపారు. అధికారులు ఆక్రమణకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకుని రోడ్డు పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్డు తొలగించాలని కోరారు.

రుడా చైర్మన్‌కు ఎమ్మెల్యేల అభినందన



చైర్మన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యేలు

సామర్లకోట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రుడా చైర్మన్‌గా పదవీప్రమాణ స్వీకారం చేసిన రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరిని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు తదితరులు సోమవారం పూలమాలలతో అభినందించారు. ముందుగా సామర్లకోటకు చేరుకున్న చౌదరి సామర్లకోటలోని తన తండ్రి సన్నిహితులు, టీడీపీ నాయకులు, సానుభూతిపరులు, పారిశ్రామికవేత్తలను కలిసి ఆశీస్సులు పొందారు. చౌదరి మాట్లాడుతూ తనపై పార్టీ ఉంచిన గురుతర బాధ్యతకు మరింత వన్నె తెచ్చేలా వ్యవహరిస్తానని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

కాకినాడ కమిషనర్ భావన



సమస్యలు వింటున్న కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో 12మంది ఫోన్ చేసి తమ సమస్యలు విన్నవించారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కమిషనర్ భావన వివిధ సమస్యలపై 56 అర్జీలు స్వీకరించారు. అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, డిప్యూటీ కమిషర్ కె.మనోహర్, ఎంహెచ్ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ శిరీష్, ఏడీహెచ్ సిరిల్, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు, ఇంజనీరింగ్ టౌన్‌ప్లానింగ్ విభాగాల అధిపతులున్నారు.

రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టాలని వినతి



వినతిపత్రం చూపుతున్న బీసీ సంఘం నాయకులు

కాకినాడ సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జనగణన జరుగుతున్నందున, దానితో పాటు రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు గుత్తుల రమణ కోరారు. రాష్ట్రంలో బీసీ కులగణన జరిపించాలని అన్ని జిల్లా కలెక్టరేట్‌ల్లో వినతులు సమర్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్రావు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం కాకినాడలో కలెక్టర్ కార్యాలయంలో బీసీ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమ వినతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపాలని జేసీని కోరారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు గుత్తుల రమణ మీడియాతో మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలోను ఎన్డీఏ కూటమి అధికారంలో ఉన్నందున జనగణనతోపాటు బీసీ కులగణన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు వాసంశెట్టి రాజేశ్వరరావు, సుందరపల్లి గోపాలకృష్ణ, చొల్లంగి వేణుగోపాల్, బత్తుల భవానీ, ఆర్ ఆశీర్వాదం, నామాల సత్యనారాయణ, టేకుమూడి శ్రీను, కాదా వెంకట కుమార్, పితాని సురేష్, రాందేవు రాజు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలి

చైర్మన్ వేములపాటికి వినతి

కాకినాడ సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): టిడ్కో లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని జనసేన నాయకుడు నల్లం శ్రీనివాస్ టిడ్కో చైర్మన్‌ను కోరారు. సోమవారం కాకినాడ పర్యటనకు వచ్చిన టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌ను సరోవర్ పోర్టికోలో ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ పర్లోవపేటలో జీ ప్లస్ త్రీ విధానంలో నిర్మించిన ప్లాట్లు నిమిత్తం 3071మంది లబ్ధిదారులు చెల్లించిన రూ.27కోట్ల9లక్షల90వేల సొమ్ము ఎండీకి బదిలీ అయ్యిందన్నారు. టిడ్కో జాప్యం వల్ల తాము చెల్లించిన రూ.లక్ష తిరిగి చెల్లించాలని ప్లాట్లు మంజూరు కాని లబ్ధిదారులు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. మంజూరైన 2056 ప్లాట్లకు 1152 ప్లాట్లు మాత్రమే లబ్ధిదారులకు అందించారన్నారు. ప్లాట్లు మంజూరు కాని లబ్ధిదారులకు సొమ్ముతిరిగి చెల్లించాలని విన్నవించారు.

సైస్లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సంస్థ డైరెక్టర్ బాబ్జి

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక భానుగుడి సెంటర్‌లోని సైస్ కంప్యూటర్స్‌లో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సీఎస్ఆర్ పథకం ద్వారా ట్యాలీ, కంప్యూటర్ అసిస్టెంట్, రిటైల్ కోర్సులలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ జంగం బాబ్జి తెలిపారు. నిరుద్యోగులై 18 నుంచి 35 ఏళ్ల వయస్సు గల ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన యువత ఈ శిక్షణకు అర్హులన్నారు. శిక్షణ 15 రోజులపాటు నిర్వహిస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేసి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఈ శిక్షణ ఈనెల 27 నుంచి ప్రారంభిస్తామని, వివరాలకు 9912300248, 9299907346 నెంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

పవర్ లిఫ్టింగ్‌లో ఆర్టీసీ డ్రైవర్‌కు ప్రథమ స్థానం



ప్రథమ స్థానం సాధించిన శ్రీనివాసరావు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావు పంజాబ్ ఖరార్‌లో జరిగిన రైతు బారా యూనివర్శిటీ నిర్వహించిన ఆలిండియా నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 450 కిలోల బరువు ఎత్తి ప్రథమస్థానం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఇప్పటివరకు రాష్ట్ర జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మొత్తం 77 పతకాలు సాధించారు. జనవరిలో బెంగళూరులో జరిగే వరల్డ్ వైడ్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారని ఆర్టీసీ డిపో యాజమాన్యం తెలిపి శ్రీనివాసరావును అభినందించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

కరప, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో ఈనెల 24న జరిగిన 24వ ఏపీ స్టేట్ ఇన్విటేషన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో యండమూరు ఎంపీయూపీ పాఠశాలకు చెందిన బాలికలు ప్రతిభ చాటారు. బ్లూ బెల్ట్ కేటగిరీలో 4వ తరగతి విద్యార్థిని యు.సిరి రజత పతకం, 5వ తరగతి విద్యార్థిని పి.హన్సిక స్వర్ణ పతకం సాధించినట్టు కోచ్ యు.లోవరాజు తెలిపారు. వారిని సర్పంచ్ మారెళ్ల శివ, హెచ్ఎం కె.సరస్వతి, పీఎంసీ చైర్మన్ శ్రీనువాసు, వైస్‌చైర్మన్ యు.సరోజిని అభినందించారు.



వరిలో కేళీల గుర్తింపు



పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వరిలో కేళీలతో దిగుబడులు తగ్గిపోయే అవకాశం ఉందిన వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ తెలిపారు. గొల్లప్రోలు మండలంలోని దుర్గాడ, చెందుర్తిలో ఏపీ సీడ్స్ వారు అందించిన ఆర్‌జీఎల్ 2537 రకం వరి పంటను సోమవారం పరిశీలించి కేళీలు గుర్తించారు. రైతులకు వరిలో అధిక దిగుబడులు సాధించడం, కేళీలకు గుర్తింపు వంటి అంశాలపై సూచనలిచ్చారు. కేళీలున్న ధాన్యాన్ని ఎంఎస్‌పీ ధాన్యం సేకరిస్తారని, నష్ట పరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. విత్తన సంస్థ కూడా రైతులతో మాట్లాడతారని తెలిపారు. ఏపీ సీడ్స్ నుంచి గంగాధర్, కనక మహాలక్ష్మీ సీడ్స్ నుంచి మణికంఠ పాల్గొన్నారు.

29న పిఠాపురంలో జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు

పిఠాపురం, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): ఈనెల 29న పిఠాపురంలో జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహిస్తున్నట్టు కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ క్రీడా మైదానం నందు ఈ పోటీలు మధ్యాహ్నం ప్రారంభమవుతాయన్నారు. సబ్ జూనియర్, జూనియర్ బాయ్స్, గర్ల్స్ ఓపెన్ ఛాంపియన్ షిప్, సీనియర్ మెన్, ఉమెన్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. పోటీలకు హాజరయ్యేవారు ఆధార్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు తీసుకురావాలని... మరిన్ని వివరాలకు 99890 01162 నంబరును సంప్రదించాలని కోరారు.

మహిళ మెడలో బంగారం చోరీ

తాళ్లరేవు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పటవల గ్రామంలో కొండమూరి వరలక్ష్మి అనే మహిళ సోమవారం తెల్లవారుజామున కాలువలో కార్తీక దీపాలను వదిలి ఇంటికి తిరిగి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఎదురుగావచ్చి మెడలో 6కాసుల బంగారు తాడును లాక్కుని అపహరించుకుపోయాడు. దీంతో బాధితురాలు కోరింగ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

'రోడ్డును వెడల్పు చేయాలి'

తాళ్లరేవు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవులో మెయిన్‌రోడ్డును ప్రభుత్వ అధికారులు వెడల్పు చేసే చర్యలు చేపట్టాలని స్థానికులు సోమవారం కోరారు. రోడ్డు ఇరుకుగా ఉండడంతో షాపుల ముందు వాహనాలను నిలపడంతో రహదారి ఇరుకై ప్రయాణికులు వాహనాలను తప్పించేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుడ్డువానితూము సెంటరు నుంచి జైభీమ్‌పేట వరకు రోడ్డును వెడల్పు చేసి ఆక్రమణలను తొలగించాలని, స్థానిక అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని పలువురు పేర్కొన్నారు.

'ఫ్యాక్టరీని తెరిపించాలి'

పెద్దాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం మండలం చిన్నింపేట గ్రామంలో ఉన్న జీడి పిక్కల ఫ్యాక్టరీని తెరిపించాలని కోరుతూ సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణికి వినతి పత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీని ఈనెల 16న అర్ధాంతరంగా మూసివేశారని, దీంతో సుమారు 409 మంది కార్మికులు రోడ్డున పడ్డారని వారికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పొట్టకొట్టడం ఎంతవరకూ సమంజసమని, యాజమాన్యంతో చర్చించి తక్షణం ఫ్యాక్టరీని తెరిపించాలన్నారు. చక్రధర్, రాజా, ప్రసాద్, దుర్గాప్రసాద్, రామదుర్గ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

పిఠాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణ శివారులోని అగ్రహారంలో ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగించారు. అదే ప్రాంతానికి చెందిన కారు లోవకుమారి శ్మశానం సమీపంలో ఖాళీ స్థలాన్ని ఆక్రమించి పాక వేసుకుంటున్నట్లు అధికారులకు సమాచారం అందింది. వెంటనే టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆక్రమణలు తొలగించారు. ప్రభుత్వ స్థలాల్లో ఏ ఆక్రమణలు చేపట్టిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ నాయకుల హర్షం

కరప, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో బీజేపీ ఘనవిజయం సాధించడం పట్ల పార్టీ నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. పెనుగుదురులో సోమవారం బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పుట్టా వీరప్రసాద్ గాంధీ, మండలాధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్ మాట్లాడుతూ మహారాష్ట్రలో బీజేపీ విజయం భారతీయుల విజయమని మిఠాయిలు పంచిపెట్టారు. మండల ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గోవింద్, ఎస్సీ మోర్చా నాయకుడు వెంపల లక్ష్మణరావు, పబ్బినీడి గోవిందు పాల్గొన్నారు.

గండేపల్లిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

గండేపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో నాతి బుజ్జి ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. తహశీల్దార్ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ బొల్లి రాంబాబు, ఏవో సద్గురుమూర్తి, ఏపీఎం సన్యాసిరావు, ఏపీవో గంగాభవానీ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

'మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి'

ఎటపాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళలకు రక్షణ కరువైందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ఐద్వా మండల కార్యదర్శి ఐ.పద్మావతి డిమాండ్ చేశారు. సోమవారం హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలు, విద్యార్థినులు గుండాల కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి భద్రాచలంలోని అంబేడ్కర్ సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. మద్యం, గంజాయి, మత్తు పదార్థాల వ్యసనాలతోనే మహిళలపై దాడులు, అత్యాచారాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మద్యం, గంజాయిలపై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు రమాదేవి, జ్యోతి మహిళా సంఘం నాయకులు సుమిత్ర, సావిత్రమ్మ, చిట్టెమ్మ పాల్గొన్నారు.



విహార యాత్రకు వచ్చిన విద్యార్థులు

ద్విచక్ర వాహనాలపై విహార యాత్రకు...

మోతుగూడెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నుంచి కొంత మంది యువకులు 20 ద్విచక్ర వాహనాలపై సోమవారం పాడేరు సందర్శనకు పయనమయ్యారు. మార్గమధ్యంలో మోతుగూడెంలోని పర్యాటక ప్రదేశాలైన ఫోర్ బై డ్యామ్, పిక్నిక్ స్పాట్స్, పుష్ప బ్రిడ్జి, డొంకరాయి రిజర్వాయర్‌లను చూశారు.



యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహమూర్తి

'గంజాయి అక్రమ రవాణా, సైబర్ క్రైమ్ జోలికెళ్లొద్దు'

వై.రామవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, నాటుసారా విక్రయాలు, సైబర్ క్రైమ్ జోలికి పోవద్దని అడ్డతీగల సీఐ నరసింహమూర్తి యువతకు విజ్ఞప్తి చేశారు. వై.రామవరం వారపు సంతలో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన అవగాహన సమావేశంలో ఆయన యువతకు పలు సూచనలు చేశారు. డ్రైవింగ్ రికార్డులు సక్రమంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. అడవి జంతువుల వేటకు వెళ్లొద్దన్నారు. జంతువుల వేటకు అక్రమ విద్యుత్ తీగలు ఉపయోగిస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. యువత ఉన్నత చదువులు చదివి ఉద్యోగావకాశాలవైపు దృష్టి సారించాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.





దేవీపట్నం మండలం గుబ్బలపాలెం శివాలయంలో ప్రత్యేక పూజలు (పైన)

మోతుగూడెం కనకదుర్గ ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించిన దృశ్యం

కార్తీక సోమవారం... కిటకిటలాడిన శివాలయాలు

మోతుగూడెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. మోతుగూడెంలోని వన కనకదుర్గ ఆలయంలో కొలువైయున్న శివయ్యకు భక్తులు పాలభిషేకం జరిపారు. పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు.

దేవీపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరుపేట-రావిలంక ఆర్అండ్‌బీ రహదారి పక్కన గుబ్బలంపాలెం మధ్యలో ఉన్న శివాలయం వద్ద సోమవారం అన్నసంతర్పణ నిర్వహించారు. హాజరైన భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి అన్నప్రసాదం స్వీకరించారు.

అక్రమ కట్టడాలపై చర్యలు శూన్యం: ఆదివాసీ సంక్షేమ పరిషత్

రంపచోడవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులు కడుతున్న అక్రమ కట్టడాలను నిలుపుదల చేసి, నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసి వారాలు గడుస్తున్నా చర్యలు శూన్యమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు మోడిద నూకరాజు అన్నారు. అడ్డతీగల మండలంలోని దుప్పులపాలెం గ్రామంలో గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలిపివేయాలని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా నేటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. గిరిజన హక్కులు, చట్టాలను అధికారులు, సిబ్బంది తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులురాలు బొరగ ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో చట్ట వ్యతిరేక ప్రాజెక్టులను రద్దు చేయాలి: శీతంశెట్టి

రంపచోడవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) గిరిజన ప్రాంతంలో చట్టాలకు వ్యతిరేకంగా అనుమతి ఇచ్చిన ప్రాజెక్టులను రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన ప్రాంత చట్టాలను ఉల్లంఘించి విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను అదానీ పవర్, షిరిడిసాయి ఎలక్ట్రికల్ కంపెనీలకు ఇవ్వడం దారుణమన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పరిశ్రమలు, జల విద్యుత్ కేంద్రాలను గిరిజన సొసైటీలతో నిర్వహించాలన్నారు. పరిశ్రమలు, జల విద్యుత్ కేంద్రాలకు గ్రామ పంచాయతీ తీర్మానం, పీసా చట్టం ప్రకారం అనుమతులు ఇవ్వాలన్నారు.

ఇరవై లీటర్ల సారా స్వాధీనం

దేవీపట్నం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవారం గ్రామ శివారున దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ సోమవారం తన సిబ్బందితో దాడి చేశారు 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 20 లీటర్ల సాటుసారా స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ చెప్పారు.

కార్తీక మాస పూజలు





కోటనందూరు: కెవో అగ్రహారం శివాలయంలో పూజలు, రౌతులపూడి శివాలయంలో భక్తులు

తుని రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసం పర్వదినాలు పురస్కరించుకుని నాల్గో సోమవారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి మహాశివునికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. తుని పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, తాండవ లింగేశ్వరస్వామి ఆలయం, తుని రూరల్‌లో తేటగుంట ఉమామహేశ్వరస్వామిఆలయం, తిమ్మాపురంలో ఉమా రామనాగలింగేశ్వరస్వామి ఆలయాలు, తపోవన క్షేత్రంలో భక్తుల రద్దీ కనిపించింది.

కోటనందూరు: కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో శైవక్షేత్రాలు భక్తులతో కికిటలాడాయి. మండంలోని భక్తులు తెల్లవారుజాము నుంచే తాండవనదిలో స్నానమాచరించి జ్యోతిలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కెవోఅగ్రహారంలో శ్రీశ్రీవిజ్ఞానశంకర్‌స్వామి, కోటనందూరులో శ్రీబోగలింగేశ్వరస్వామి, అల్లిపూడిలో తాండవరామలింగేశ్వరస్వామి, బొద్దవరంలో శ్రీగౌరికాశీజ్ఞానేశ్వరస్వామి, బీమవరపుకోట, బంగారయ్యపేట ఆలయాల్లో ప్రత్యేకపూజలు జరిగాయి. అనంతరం అన్నదానాలు నిర్వహించారు.

కిటకిటలాడిన శివాలయాలు

శంఖవరం: మండలంలోని కత్తిపూడి, శంఖవరం, వేళంగి గ్రామాల్లో శివాలాయలకు భక్తులు పొటేత్తారు. వేకువజాము నుంచే పూజలు చేశారు. మహిళలు హాజరై దీపాలు వెలిగించారు.

రౌతులపూడి: రౌతులపూడి, శృంగవరం గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలడాయి. మహిళలు దీపాలు వెలగించారు. ఆలయాల ఆవరణ నందు అభిషేకాలు నిర్వహించారు. శృంగవరం శివాలయం వద్ద అన్నదానం జరిగింది.



తుని రూరల్: కాట్రావుల కొండ వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

కిర్లంపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడి హైస్కూల్‌లో సోమవారం సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ హాజరయ్యారు. ఇటీవల సైబర్ నేరాలు పెరుగుతున్న దృష్ట్యా వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్‌పాయింట్ ద్వారా ప్రజంటేషన్ ఇచ్చారు. డిజిటల్ అరెస్ట్ అనేది లేదని అవగాహనతోనే సైబర్ నేరాలను అడ్డుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

మల్లేపల్లిలో...

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి హైస్కూల్‌లో సోమవారం గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు మహిళా రక్షక్ కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడి జీవితాలు పాడుచేసుకోవద్దని సూచించారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఏలేశ్వరం నుంచి వాడపల్లికి పాదయాత్ర



పాదయాత్రగా వెళుతున్న బంక రాజు

ఏలేశ్వరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరంలో చిన్న వ్యాపారస్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బంక రాజు ఏలేశ్వరం నుంచి వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం పాదయాత్ర చేపట్టారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఏలేశ్వరంలో షాపులకు అక్రమంగా రాత్రికి రాత్రే కూల్చివేసిన ఘటన జరిగింది. షాపులు పునర్నిర్మాణం చేపడితే కాలినడకన వాడపల్లి స్వామి సన్నిధానానికి వెళ్లి మొక్కు తీర్చుకుంటానని అనుకున్నానని తెలిపారు. రాజు పాదయాత్ర విజయవంతం అవ్వాలని బీజేపీ నాయకులు పైల సుభాష్ చంద్రబోస్, అలమండ నాగేంద్రకుమార్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాలక పాటి సోమరాజు, సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీయూఎస్ నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రత్తిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో నూతనంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మండల శాఖ ఏర్పాటైంది. ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎస్ చలపతి ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్లో సంఘ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.గణపతిరావు, గౌరవ అధ్యక్షుడిగా పోసిన వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా ఎస్.సత్తిబాబు, కోశాధికారిగా సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా శివ ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతామని ఏపీయూఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్‌వీఎస్ చలపతి, హెచ్‌ఎం శ్రీనివాసరావు, కె.అప్పారావు పాల్గొన్నారు.

'మురుగునీటి సమస్యను పరిష్కరించాలి'

ప్రత్తిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో రహదారులపై మురుగునీరు నిల్వ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మహిళలు ఆందోళన చేశారు. సీతంపేట రామాలయం తూర్పు వీధిలో మహిళలు రహదారిపై నిల్వ ఉన్న మురుగునీటి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనకు బీజేపీ మండల ఉపాధ్యక్షుడు బుగతా వీరబాబు మద్దతు తెలిపి రహదారిలో మురికి నీటి నిల్వపై పంచాయతీ, మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆందోళన చేపట్టిన మహిళలు, బీజేపీ నాయకులు బుగతా వీరబాబు మాట్లాడుతూ సీతంపేట 14వ వార్డు, సినిమాహాల్ సెంటర్, జగనన్న కాలనీ, నూకాలమ్మ గుడి పాఠశాల వద్ద మురుగునీరు నిల్వ ఉంటుందని వీటి పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.



ఆందోళన చేస్తున్న మహిళలు

ప్రత్తిపాడులో న్యాయవాదుల ధర్నా



ప్రత్తిపాడులో ధర్నా నిర్వహిస్తున్న న్యాయవాదులు

ప్రత్తిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, నివారించాలని డిమాండ్ చేస్తూ ప్రత్తిపాడులో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు సోమవారం ధర్నా నిర్వహించారు. విశాఖపట్నంలోని న్యాయ కళాశాల విద్యార్థిని అమానుషంగా సామూహికంగా అత్యాచారం చేసిన ఘటన, తమిళనాడు రాష్ట్రంలోని కోర్టు విధులకు హాజరయ్యే న్యాయవాదిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటనలపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై జరుగుతున్న అకృత్యాలకు నిరసనగా స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి ఆందోళన నిర్వహించి అనంతరం జడ్జి కాటంభానుకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, నాయకులు రమణం వెంకట్రావు, పలివెల నాగేంద్రరాజు, జొన్నాడ రాజేష్, లింగంపల్లి శివకుమార్, సీనియర్ న్యాయవాదులు చలంకూరి రామకృష్ణ, జె.కుక్కుటేశ్వరరావు, బుగతా శివ, పిల్లి బలరాముడు, ఆర్.శ్రీనివాసరావు, టీకే ప్రసాదరావు, జి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పలుచోట్ల కార్తీక వన సమారాధనలు

కిర్లంపూడి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో నూకాలమ్మతల్లి ఆలయంలో కార్తీక సోమవారం పురస్కరించుకుని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కుటుంబీకులు భారీ అన్నదానం నిర్వహించారు. ముద్రగడ గిరిబాబు అమ్మవారికి విశేష పూజలు చేశారు. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరై అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఎల్లపు దొరబాబు, గంధం ప్రభాకర్, మాదారపు వీరబాబు, గోకేడ ప్రసాద్ ఉన్నారు.

ప్రత్తిపాడు: ధర్మవరంలోని కోల్డ్‌స్టోరేజ్ మామిడితోటలో కాపు వన సమారాధనలో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, మాజీ మండల ఉపాధ్యక్షుడు బొల్లు కొండబాబు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ ముదునూరి మురళీకృష్ణంరాజు, గ్రామపెద్దలు ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మవరం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. శాంతి ఆశ్రమం, రమణ సేవాశ్రమం, ఎరకం పాలెం ఆశ్రమం వద్ద కార్తీక వన సమారాధన కోలాహలంగా నిర్వహించారు.

రౌతులపూడి: మూలగపూడి గ్రామంలో సర్పంచ్, టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ మామిడితోటలో వన సమారాధన నిర్వహించారు. గ్రామస్థులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు అన్న ప్రసాదాలు స్వీకరించారు.



కిర్లంపూడిలో కార్తీక వన సమారాధనలో పాల్గొన్న తుమ్మలపల్లి రమేష్

రాజగోపాలస్వామి ఆలయంలో దీపోత్సవం





ధర్మవరంలో కార్తీక దీపోత్సవంలో దీపాల వెలుగుల దృశ్యాలు

ప్రత్తిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో రాజగోపాలస్వామి ఆలయంలో సోమవారం రాత్రి కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వెంకటేశ్వరస్వామి నామాలు, శంకు చక్రాలు వివిధ రకాల కళారూపాలను దీపోత్సవంలో భాగంగా మహిళా భక్తులు దీపాలు వెలిగించడంతో విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రధాన అర్చకుడు అంగర లక్ష్మినరసింహాచార్యులు, పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు లక్ష దీపోత్సవం

ప్రత్తిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రభద్రాద్రి శ్రీరామ క్షేత్రం వద్ద మంగళవారం రాత్రి గోదా రంగనాథ గోష్టి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక నరేంద్రగిరి కొండ వద్ద సోమవారం గోదారంగనాధ గోష్టి గురివర్యులు గుడిమెళ్ళ లక్ష్మణాచార్యులు, జయలక్ష్మి దంపతులు మహిళా కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ శ్రీరామనామ క్షేత్రంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని శివుడు ఆశీస్సులు పొందాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు చాట్ల పుష్పారెడ్డి, రెడ్నం రాజు, గోగుల బుజ్జి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు భోజనాలు



జగ్గంపేటలో పేదలకు భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

జగ్గంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్‌లో గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతులనవీన్ కుమార్ నేతృత్వంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం కొయ్యన ఉమామహేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన భార్య లక్ష్మీ, కుమారుడు రోహిత్ యాదవ్ ఆర్థిక సహాయంతో పేదలకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం ఉమామహేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. మారిశెట్టి భద్రం మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాలుగా నెహ్రూ, నవీన్ నేతృత్వంలో దాతల సహకారం తో ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, తెలుగు యువత ఉపాధ్యక్షుడు బద్ది సురేష్, వేములకొండ జోగారావు, ఒమ్మి శ్రీనివాస్, ఒమ్మి యనోష్ కుమార్, ఈగల సత్యవతి, బొబ్బిలి విజయ, మారిశెట్టి గంగ తుమ్మల కిషోర్, ప్రేమ స్వరూప్ బుజ్జి ఉన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన జ్యోతుల నవీన్



మంత్రి లోకేశ్‌తో జ్యోతుల నవీన్

జగ్గంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో మానవ వరునల అభివృద్ధి శాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఆయన ఛాంబర్‌లో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు, ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి చర్చించారు. నవీన్ వెంట జగ్గంపేట నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు అనుకూల శ్రీకాంత్, టీడీపీ నాయకులు తుము కుమార్ తదితరులు ఉన్నారు.

లోకేశ్‌ను కలిసిన సాయితేజ్



లోకేశ్‌తో సాయితేజ్

గండేపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను అమరావతిలో సోమవారం గండేపల్లి మండలం సింగరంపాలెం గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో అభివృద్ధి పనులు, పథకాలను వేగంగా అమలుచేయడంపై చర్చించారు.

లోవ దేవస్థానానికి వెండి సామగ్రి వితరణ



వెండి సామగ్రి అందజేస్తున్న దృశ్యం

తుని రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో అమ్మవారి పూజలో వినియోగించేందుకు వెండి సామగ్రిని తునికి చెందిన భక్తుడు వితరణ చేశారు. రూ.20వేలు విలువల చేసే సామగ్రిని బియ్యపు నాగమణి కుమారుడు సాయి తేజ చేతులమీదుగా అధికారులకు అందజేశారు. సామగ్రిని అమ్మవారి పూజా కైంకర్యాల్లో వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. దాతను ఆలయ పండితులు శేషవస్త్రంతో సత్కరించి వేద ఆశీర్వచనాలు అందజేశారు.

సారాతో మహిళ అరెస్ట్

తుని రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తుని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ శాఖాధికారులు తుని మండలం హంసవరంలో తనిఖీలు చేపట్టారు. ఓ మహిళ ఇంట్లో 2 లీటర్ల సారాతో పట్టుపడగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌హెచ్‌వో శేషగిరి తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలతో జాగ్రత్తగా ఉండాలి : సీఐ

జగ్గంపేట రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాండ్రేగుల హైస్కూల్లో మహిళలు, బాలికలకు మహిళా రక్షక్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జగ్గంపేట సీఐవైఆర్‌కె శ్రీనివాస్ మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్‌కు పాల్పడడం నేరమని, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ రామిశెట్టి పాపారావు, టీడీపీ నాయకులు ఎల్లపు దొరబాబు, జడ్పీ హైస్కూల్ ప్రిన్సిపాల్ బి.ఉదయ శ్రీశ్రీ, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం పీవీవీ సత్యనారాయణ, స్కూల్ అసిస్టెంట్ ఎస్.అర్జునకుమార్, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న బొర్రా గోపీ

రౌతులపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ ప్రజా సంఘాలు, ఉపాధ్యాయులు సంఘాలు బలపరిచిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపీ సోమవారం ప్రచారం నిర్వహించారు. రౌతులపూడి మండలంలోని హస్కూల్స్, ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ కళాశాల నందు ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. సీపీఎస్ రద్దు తదితర సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.